PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 19.04.2013, శుక్రవారం సంపుటి : 32 సంచిక : 46 పేజీలు : 12, వెల : ₹ 4




# లాయర్


వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

# అభి'మానం' తాకట్టు పెట్టిన ఆనం




- వై.యస్. కుటుంబంపై వ్యాఖ్యల వెనుక ఆనం అంతరంగం అందలమే
- కిరణ్‌ను వీడి ఆనంకు బాసటగా నిలుస్తున్న కళంకిత మంత్రులు
- వై.యస్.పై నీతిమాలిన వ్యాఖ్యలతో ప్రజల దృష్టిలో విలన్‌గా మారిన ఆనం

ఆయన మాటలు తూటాలయ్యాయి. కోట్లాదిమంది ప్రజల హృదయాలను ఈటెల్లా తాకాయి. ఎన్నో మనసులను గాయపరిచాయి. మరెందరికో ఆవేశాన్ని తెచ్చాయి. రాజకీయాలలో విమర్శలు సహజమే. మరీ ఇంతగా వ్యక్తిగత విమర్శలా... అది కూడా వై.యస్. బ్రతికుండగా ఆయనను తమ అభిమాన నాయకుడిగా కొలిచిన వాళ్ళే, ఆయన మరణానంతరం ఆయన కుటుంబంపై నీచాతినీచంగా మాట్లాడడమా? ఈ సమయంలో ఇలా మాట్లాడాల్సిన అవసరముందా? శత్రువులు సైతం చనిపోయిన మనిషిని వేలెత్తి చూపరు. ఎందుకంటే అది మానవ సంస్కారం. కాని ఇక్కడ ఉపకారం చేసిన మనిషిని కూడా ఆయన చనిపోయాక ప్రయోజనం పొందినవాళ్లే, ఆయన చేతుల ద్వారా పదవులు అందుకున్నవాళ్ళే అతి దారుణంగా విమర్శించడం చూసి రాష్ట్ర ప్రజలే ఒక్కసారిగా నివ్వెరపోయారు. (మిగతా 5వ పేజీలో)




## పీసీసీ సారథి మారేనా?






రానున్నది ఎన్నికల సీజన్ కావడంతో పీసీసీ సారథిని మార్చాలనే ప్రయత్నాలకు కాంగ్రెస్ అధిష్టానం శ్రీకారం చుట్టినట్లుగా తెలుస్తుంది. ఈమేరకు ముఖ్యమంత్రిని, పీసీసీ చీఫ్‌ను కాంగ్రెస్ పెద్దలు ఢిల్లీకి పిలిపించుకుని మాట్లాడారు.

తెలంగాణ సమస్యలు సెగలుపొగలు కక్కుతున్న నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ సారథ్యం తెలంగాణ నేతకే ఇవ్వాలనే ఆలోచనకు కాంగ్రెస్ అధిష్టానం వచ్చినట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో సెంటిమెంట్‌గా చూస్తే మాజీసారథి డి.శ్రీనివాస్ పేరు తెరమీదకొస్తుంది. కాంగ్రెస్ ఈ రాష్ట్రంలో రెండుసార్లు అధికారంలోకి వచ్చిన 2004, 2009ఎన్నికలలో పీసీసీ చీఫ్‌గా డిఎస్సే వున్నాడు. వై.యస్. కష్టంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా సెంటిమెంట్ పరంగా ఆ సమయంలో పీసీసీ చీఫ్‌గా డి.యస్. వుండడం ఆయనకు కలిసొచ్చింది. సెంటిమెంట్ అయితేనేం, (మిగతా 5వ పేజీలో)


## తెలంగాణ...
## కాంగ్రెస్ ఖాళీ

కారెక్కనున్న కాంగ్రెస్ నేతలు



రాష్ట్రంలో కాంగ్రెస్ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటుంది. తెలంగాణలో ఇంకా ఎక్కువ కష్టాలను చవిచూస్తుంది. సీమాంధ్ర ప్రాంతంలో వైయస్సార్ కాంగ్రెస్ ధాటికి కకావికలమైన కాంగ్రెస్‌పార్టీకి తెలంగాణలో మాత్రం టీఆర్ఎస్ పార్టీ కంట్లో నలుసులా మారింది. తెలంగాణ విషయంపై కాంగ్రెస్ అధిష్టానం ఇంకా ఏం తేల్చలేదు. ఈ నాన్చుడు వైఖరి తెలంగాణ కాంగ్రెస్ నేతలకు పెద్ద ఇబ్బందిగా మారుతుంది. తెలంగాణపై కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకుంటుందన్న ఆశ కూడా లేదు.

రాబోయేది ఎన్నికల కాలం. ఒక రకంగా తెలంగాణలో కాంగ్రెస్ నాయకులకు కష్టకాలం. ఎందుకంటే రేపు కాంగ్రెస్‌కు ఓట్లేయమంటూ ప్రజలముందుకు వెళ్లాలంటే నాయకులు భయపడుతున్నారు. ఈ పరిస్థితుల నుండి బయటపడాలంటే వారి ముందున్న మార్గం పార్టీ జెండాను మార్చడమే! వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ ఎలాగూ గెలుస్తుందన్న వాతావరణం లేని నేపథ్యంలో గెలిచే పార్టీలోకి దూకడమే! ఇందుకు కొందరు నాయకులు టీఆర్ఎస్‌ను ఎంచుకుంటే మరికొందరు వైయస్సార్ కాంగ్రెస్ వైపు మొగ్గుచూపుతున్నారు. నిరాశ నిస్పృహలతో కొట్టు మిట్టాడుతున్న టీ-కాంగ్రెస్ ఎంపీలకు, నాయకులకు టీఆర్ఎస్ (మిగతా 5వ పేజీలో)

PDF Compressor Free Version



## మాగుంట లే అవుట్‌లో...

# "టిఫిన్స్" సెలబ్రేషన్స్

సెలబ్రేషన్స్ అంటేనే శుభ సందర్భాన్ని సూచిస్తుంది. ఏదైనా ఆనందకర సంఘటనను జరుపుకోవడమే సెలబ్రేషన్. ఈ పేరుకు పూర్తిగా సార్ధకత చేకూరేలా నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని సెలబ్రేషన్స్ హోటల్స్ యాజమాన్యం తమ ప్రస్థానాన్ని సాగిస్తోంది. వివిధ ప్రాంతాల రుచులతో మాంసాహార భోజన సముదాయాన్ని ఏర్పాటుచేసి అనతి కాలంలోనే విశేష ప్రాచుర్యాన్ని పొంది ఇటు హోటల్ నిర్వహణలోనూ అటు క్యాటరింగ్ విభాగంలోనూ సెన్సేషన్‌గా నిలిచి, ఇప్పుడు "సెలబ్రేషన్స్ టిఫిన్స్" పేరుతో మరోశాఖను ప్రారంభించారు. పూర్తిగా శాఖాహార ప్రియుల కోసం ముస్తాబైన ఈ హోటల్‌లో అన్నిరకాల శాఖాహార టిఫిన్స్‌ను అందిస్తున్నారు. ఏప్రిల్ 13వ తేదీ శనివారం ఉదయం నెల్లూరునగర శాసనసభ్యుడు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కావలి శాసన సభ్యుడు బీద మస్తాన్‌రావులు ఈ రెస్టారెంట్‌ను ప్రారంభించారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆనం విజయకుమార్‌రెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి, మాజీమేయర్ శ్రీమతి నందిమండలం భానుశ్రీ, ప్రముఖ గుండెవైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాసరాజు, వైయస్సార్సీపీ నాయకుడు ముక్కాల ద్వారకానాథ్, ఆంధ్రాక్లబ్ అధ్యక్షుడు కొడవలూరు సుబ్బారెడ్డి, నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ ఇన్‌ఛార్జ్ కమీషనర్ సంపత్‌కుమార్, బొల్లినేని హాస్పిటల్స్ ముఖ్యనిర్వహణాధికారి గిరినాయుడు ఈ ప్రారంభోత్సవ వేడుకలో పాల్గొన్నారు.

### ఆనం సెంటిమెంట్...



గతంలో తమ హోటల్‌ను రూరల్ శాసనసభ్యుడు ఆనం వివేకానందరెడ్డి ప్రారంభించడం తమకు కలిసొచ్చిందనే సెంటిమెంట్‌తో ఈ నూతన ప్రాంగణం పేరుని హైదరాబాదుకు తీసుకువెళ్ళి అక్కడే అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న వివేకాతో రిబ్బన్ కట్ చేయించి ప్రారంభోత్సవం చేయించారు. ఆదివారం ఉదయం ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డి సైతం హోటల్‌ని సందర్శించి ఉపాహారం స్వీకరించి, కార్పొరేట్ స్థాయిలో మహానగరాలకు ధీటుగా "టిఫిన్స్" హోటల్‌ను రూపొందించిన "సెలబ్రేషన్స్" యాజమాన్యాన్ని అభినందించారు. ఆల్‌ది బెస్టటు సెలబ్రేషన్స్.

# వేడుకగా మలేసియాలో ప్రపంచ తెలుగు మహాసభలు



రోశయ్యతో జస్టిస్ చలమేశ్వర్, కేంద్రమంత్రి బలరామ్‌నాయక్, వి.ఎల్.ఇందిరాదత్, వెనుక నెల్లూరీయుడు ఎన్. బలరామయ్యనాయుడు

ప్రపంచ తెలుగు సమాఖ్య 10వ వార్షిక మహాసభలు-2013 మలేసియాలోని కౌలాలంపూర్‌లో ఏప్రిల్‌నెల 12,13,14తేదీల్లో సన్‌లే రిసార్ట్స్‌లో వేడుకగా అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో తెలుగు సమాఖ్య అధ్యక్షురాలు వి.యల్. ఇందిరాదత్, మలేసియా తెలుగు సంఘం అధ్యక్షుడు డా॥అచ్చయ్యకుమార్ ఆధ్వర్యంలో జరిగాయి. ముఖ్య అతిథులుగా తమిళనాడు గవర్నర్ డా॥కొణిజేటి రోశయ్య భారతదేశ కేంద్ర సోషల్ జస్టిస్ శాఖా మంత్రి బలరాం నాయక్, భారతదేశం సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి చలమేశ్వరరావు, మలేసియా డిఫెన్స్ మంత్రి డా॥అహమ్మద్ జమీద్ హామీది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగు లాంగ్వేజ్ ఒరిజినల్ అండ్ డెవలెప్‌మెంట్‌పై ఆపుల మంజుల అధ్వర్యంలో సెమినార్ జరిగింది. తెలుగు లాంగ్వేజ్, టెక్నాలజీ అండ్ డెవలప్‌పై మేడసాని మోహన్ ఉపన్యసించారు. అదే విధంగా మహిళా, యూత్, బిజినెస్ కాన్ఫరెన్స్‌లు, రెండు దేశాల మధ్య వ్యాపారవేత్తల సెమినార్‌పై మార్గదర్శి చిట్‌ఫండ్స్ జి.యం సిహెచ్ శైలజాకిరణ్, దొడ్ల డైరి యం.డి దొడ్ల సునీత సునీల్‌రెడ్డి తదితరులు ప్రసంగించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా వందేమాతం శ్రీనివాస్ పాటకచ్చేరి, జానపద, భరత నాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, బుర్రకథ, తదితర కార్యక్రమాలు జరిగాయి. తెలుగు సినీరంగం నుండి ప్రఖ్యాత దర్శకులు కె.రాఘవేంద్రరావు, నటులు సాయికుమార్, అలీ, రచయిత, గాయకుడు ఘంటసాల రత్నకుమార్, సంగీత దర్శకురాలు యం.యం.శ్రీలేఖ, యాంకర్ ఝాన్సీ వర్ధమాన హాస్యనటులు ధనరాజ్, తాగుబోతు రమేష్‌లు పాల్గొని అందరినీ అలరించారు. ప్రపంచ తెలుగుసమాఖ్య నెల్లూరుజిల్లా కన్వీనర్ ఎన్.బలరామయ్య నాయుడు ఈ వేడుకలకు హాజరై అక్కడ ఏర్పాట్లలో పాలుపంచుకొని అతిథులకు అన్ని వసతులు ఏర్పాటు చేయడంలో తనవంతు పాత్రను పోషించాడు.

# మే4న 'అన్నమయ్య జయంతి'

- ఇక ప్రతియేడాది మే మొదటి శనివారం నాడు అన్నమయ్య విగ్రహం వద్ద ఈ వేడుకలు



నెల్లూరు రాజీవ్ రహదారి (మినీబైపాస్)లోగల అన్నమయ్య విగ్రహ ప్రాంతంలోని అన్నమయ్య సర్కిల్ నందు అన్నమాచార్య జయంతి వేడుకలను ఇకపై ప్రతి యేడాది మే తొలి శనివారం నాడు జరపనున్నట్లు విగ్రహ కమిటీ సభ్యులు తెలిపారు. తొలి కార్యక్రమాన్ని రానున్న మే4వ తేదీ నిర్వహించనున్నట్లు తెలిపారు. 4వ తేదీ శనివారం సాయంత్రం 6గంటల నుండి ఇక్కడ "అన్నమయ్య స్వరార్చన" నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో నెల్లూరుజిల్లాకు చెందిన పలువురు సుప్రసిద్ధ సంగీత కళాకారులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమ రూపకల్పన జరుగుతోందని, త్వరలో పూర్తి వివరాలను అందిస్తామని, శ్రీవేంకటేశ్వరస్వామి వారి భక్తులు, అన్నమయ్య ఆరాధకులు, సంగీతప్రియులు, కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని "అన్నమయ్య విగ్రహకమిటి" ఆహ్వానిస్తోంది.


శ్రీరస్తు శ్రీమతే రామానుజాయనమః శుభమస్తు



శ్రీ రుక్మిణీ-సత్యభామా సమేత,

శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవస్థానము

మూలాపేట, నెల్లూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా. ఫోన్: 0861-2320066

e-mail : srivenugopalaswamytemple_nlr@yahoo.com

శ్రీ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవముల ఆహ్వానము

స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ విజయనామ సంవత్సర చైత్రమాస వసంత ఋతువు తేది 20-04-13 శనివారము నుండి తేది 30-04-13 మంగళవారము వరకు నెల్లూరు, మూలాపేటలో వెంచేసియున్న శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానం నందు నిర్వహించబడు వార్షిక బ్రహ్మోత్సవములలో 1. యజుర్వేద పారాయణము, 2. ఉపనిషత్తులు, 3. పంచసూక్తములు, 4. నాలాయర ద్వియప్రభందం, 5. తిరుమంజనము, 6. తిరుప్పావై - శాత్‌మొరై(చివరి రెండు పాశురములు), 7. పెరియ తిరుమొళి - దివ్యసూక్తి (తిరుమంగై ఆళ్వార్ పాశురములు) పారాయణములు, 8. శ్రీ సుదర్శన శతకములు, 9. ప్రబంధ పారాయణములు, 10. సుందరకాండ ప్రవచన పారాయణములు మరియు ఉపన్యాస, సంగీత, నృత్యతరంగ, రాగాలాపన, హరికథాకాలక్షేపములు, కళావిన్యాసములు, లాస్యనాట్యములు జరుగును. భక్తులు శ్రవణానందముగా ఆలకించి, వీక్షించి శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి దివ్యాలంకరణ సేవలను గాంచి తీర్థప్రసాదములు స్వీకరించి శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి కృపకు పాత్రులై తరించగలరు.

శ్రీ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవ వివరములు

చైత్రమాసము

| తేది - వారము - తిథి | ఉదయం గం॥ 8-30 | రాత్రి గం॥ 7-00 లకు |
|---|---|---|
| 20-4-13 శని శు॥ దశమి | - | అంకురార్పణ (సా॥ 6-30 ని॥లకు) |
| 21-4-13 ఆది శు॥ ఏకాదశి | ధ్వజారోహణము | శేషవాహనము (నెల్లూరు నగర ఉత్సవము) |
| 22-4-13 సోమ శు॥ ద్వాదశి | సూర్యప్రభ | హంసవాహనము (పేట ఉత్సవము) |
| 23-4-13 మంగళ శు॥త్రయోదశి | యాలి ఉత్సవము | చంద్రప్రభ (నెల్లూరు నగర ఉత్సవము) |
| 24-4-13 బుధ శు॥ చతుర్దశి | చప్పరము | వెండి హనుమంత సేవ (నెల్లూరు నగర ఉత్సవము) |
| 25-4-13 గురు శు॥ పౌర్ణమి | మోహిని (గిన్నె భిక్ష) | గరుడసేవ (సా॥ 4 గం॥ నుండి నెల్లూరు నగర ఉత్సవము) |
| 26-4-13 శుక్ర బ॥ పాడ్యమి | - | కళ్యాణము, ఏనుగు వాహనం (పేట ఉత్సవము) |
| 27-4-13 శని బ॥ విదియ | రథోత్సవము | పుష్పక విమాన అలంకారం (పేట ఉత్సవము) |
| 28-4-13 ఆది బ॥ తదియ | వెన్నెతాళి ఉత్సవం | అశ్వవాహనం (పేట ఉత్సవము) |
| 29-4-13 సోమ బ॥ చవితి | తీర్థవాది (మునుగుల సేవ) | పొన్నవాహనం (నెల్లూరు నగర ఉత్సవము) |
| 30-4-13 మంగళ బ॥ పంచమి | - | ఏకాంత సేవ, ధ్వజావరోహణం |

పైదినములలో ప్రతిరోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమములు కలవు

గోపూజ: ప్రాచీన పవిత్ర భారతీయ సంస్కృతీ సంపదలకు ప్రతీక గోమాత. గోసేవ, గోదానం, గోసంరక్షణ చేసిన సర్వపాపాలు నశించి ధీరోదాత్త గుణాలు అలవడగలవు. ధనసంపదలు వృద్ధి చెంది వంశవృద్ధి జరుగుతుంది. ఈ క్రమంలో ధర్మచింతన పెంపొందించే సదాశయంతో దేవస్థానం గోపూజను ఆర్జితసేవగా నిర్వహించ సంకల్పిస్తూ, భక్తులు రూ.116/-లు రుసుముగా చెల్లించి ఆలయ ప్రాంగణంలో గోత్రనామాలతో స్వయంగా గోమాతకు పూజను జరిపించుకోవచ్చు.



ఈ బృహత్తర కార్యక్రమంలో పాల్గొని తరించవలసిందిగా మనవి.

ఇట్లు

శ్రీ ఆనం వివేకానందరెడ్డి

ఎమ్.ఎల్.ఏ., ఛైర్మన్ & మేనేజింగ్ ట్రస్టీ



మరియు వ్యవస్థాపక ధర్మకర్తల మండలి

శ్రీ ఆనం చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీ మన్నెం లక్ష్మీనాథ్‌రెడ్డి

శ్రీ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, శ్రీ తుమ్మల సుబ్బారెడ్డి

PDF Compressor Free Version



## అన్నపై తమ్ముడి దాడి

# రివర్స్ పంచ్

### ఆనం కుటుంబంలో అంతర్గత విభేదాలు బహిర్గతం



**దివంగత మహానేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి కుటుంబంపై రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేసిన విమర్శలను చాలామంది నాయకులు ఎన్నోరకాలుగా ఖండించారు. వైకాపా నాయకులు తీవ్ర పదజాలంతో ఆనంపై ఎదురుదాడికి కూడా దిగారు. అయితే వీరందరూ చేసిన ఎదురుదాడి ఒకెత్తయితే, స్వయానా మంత్రి సోదరుడు ఆనం జయకుమార్‌రెడ్డి చేసిన ఎదురుదాడి మరోఎత్తు.**

మంత్రి ఆనం వ్యాఖ్యలను ఆయన తమ్ముడే ఖండించడం రాజకీయంగా ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. అంతేకాదు ఎంతోకాలంగా తన సోదరులతో విభేదించి వైకాపాలో ప్రవేశం కోసం ఎదురుచూస్తున్న ఆనం జయకుమార్‌రెడ్డికి ఇప్పుడు అవకాశం కలిసొచ్చింది.

ఈ జిల్లాలో నేదురుమల్లి, ఆనం, నల్లపరెడ్డి, బెజవాడ, మేనకూరు, మాగుంట, సోమిరెడ్డి వంటి ఎన్నో రాజకీయ కుటుంబాలున్నాయి. వీరిలో కొందరిని మినహాయిస్తే చాలా కుటుంబాలలో అన్నదమ్ముల మధ్య రాజకీయ గొడవలు వచ్చిన సందర్భాలెన్నో. అఖరుకు నేదురుమల్లి సోదరులు సైతం ఇటీవల విడిపోవడం చూసాం. కాని దివంగత ఆనం వెంకురెడ్డి కొడుకులు ఆనం వివేకానందరెడ్డి, ఆనం రామనారాయణ రెడ్డి, ఆనం జయకుమార్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డిలు నిన్నటి వరకు ఒకేమాట, ఒకే బాట అన్నట్లు నడిచారు. వివేకా, రామనారాయణలు రాజకీయంగా ఎదగడానికి వారి తమ్ముళ్లు జయ, విజయలు ఎంతగానో శ్రమించారు. మొన్నటి వరకు ఆ నలుగురు ఒకటిగా వుండబట్టే రాజకీయాలలో ఎంతటివారినైనా ఎదుర్కొంటూ రాగలిగారు. అయితే కారణాలేవైతేనేం ఈ మధ్య కాలంలో మిగతా సోదరులతో ఆనం జయకుమార్‌రెడ్డి విభేదిస్తున్నాడు. కొంతకాలంగా ఆయన మిగతా సోదరులకు, రాజకీయాలకు దూరంగా వుంటున్నారు. వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరాలనేది ఆలోచన. ఇంకా అధికారికంగా చేరలేదు. కాని ఇప్పుడు తన అన్న వ్యాఖ్యలను ఖండించడం ద్వారా వైకాపా శ్రేణులకు బాగా చేరువయ్యారు. తమ సోదరులకు పూర్తిగా దూరమయ్యాడు.



**వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా కన్వీనర్ పదవి నుండి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తప్పుకుంటారనే ప్రచారం జోరుగా వుంది. నేను సర్వేపల్లినే చూసుకుంటాను, జిల్లా కన్వీనర్ పదవిని వదిలేస్తానని గతంలో కాకాణి కూడా ప్రకటించాడు. అయితే కాకాణి ఆ పదవి నుండి తప్పుకుంటే జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ గాడి తప్పడం ఖాయం.**

# కాకాణి లేకుంటే కష్టమే!

వైయస్ సానుభూతి, జగన్ గాలి, ప్రభుత్వం పట్ల వ్యతిరేకత బలంగా వుంది కాబట్టి ఈరోజు జనం వైయస్సార్ కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారు. కాని గాలి రాజకీయాలు ఎల్లకాలం వుండవు. ఎక్కడికక్కడ స్థానిక నాయకత్వాలు కూడా పటిష్ఠంగా వుండాలి. కాంగ్రెస్‌లో ఆనం సోదరులు, తెలుగుదేశంలో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి... జిల్లా పార్టీ అధ్యక్షులుగా తాము వున్నా తమ అనుచరులు వున్నా జిల్లా మొత్తం మీద పార్టీలను నడిపేది వీళ్లే! కాని వైకాపాలో అంతటి సామర్థ్యం ఎవరికి వుంది? పార్టీకి రాష్ట్రంలోనే పెద్ద నాయకులమని చెప్పుకుంటున్న మేకపాటి సోదరులకు సొంత నియోజకవర్గాలలోనే అంత సీన్ లేదు. జిల్లా మొత్తం పార్టీని వాళ్లు నడపలేరు. నలుగురినీ కలుపుకుపోయే చాకచక్యం వారికి లేదు. పార్టీలో మిగతా నాయకులను చూస్తే ఎవరి నియోజకవర్గాలకు వాళ్లు పరిమితం.

జిల్లా మొత్తంమీద పరిచయాలు, అందరితో సన్నిహిత సంబంధాలు వున్నది కాకాణికే! ఈ జిల్లాలో వైకాపాలోకి వచ్చిన నాయకులంతా ఎవరికి వాళ్లుగా వచ్చినవాళ్లే! కాని కాకాణే 20మంది జడ్పీటీసీలు, అంతే సంఖ్యలో ఎంపీటీసీలు, పెద్దసంఖ్యలో సర్పంచ్‌లతో పార్టీలో చేరారు. కాకాణి రాబట్టే గత స్థానికసంస్థల శాసనమండలి నియోజకవర్గం ఎన్నికలలో వైకాపా అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి దాదాపు గెలుపు స్థాయికి వచ్చి ఓటమిపాలయ్యాడు. కాకాణి లేకుంటే పోటీ కాంగ్రెస్, తెలుగుదేశంల మధ్యే ముగిసివుండేది.

జిల్లాలో పార్టీని నడపాలంటే సమర్థవంతమైన నాయకత్వం అవసరం. ఆ సమర్థత కాకాణికే వుంది. ఆయన కన్వీనర్ పదవి నుండి తప్పుకుంటే జిల్లాలో పార్టీకి కొంత ఇబ్బందికర పరిస్థితే!



# పరసా... ఇదేం పని!

### ఎమ్మెల్యే వైఖరితో విస్తుపోతున్న తెలుగుతమ్ముళ్ళు

**రాష్ట్రంలో కాంగ్రెస్-తెలుగుదేశంల మధ్య పరోక్ష దోస్తీ సాగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాపాడుతున్నది ఆ పార్టీయేనన్నది తేటతెల్లం. తెలుగుదేశం అధినేత ప్రతిపక్ష నాయకుడు కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. అంటే ఆయనది పైన కుస్తీ, లోన దోస్తీ అన్నట్లుగా వుంది. చంద్రబాబుకు వున్నన్ని తెలివితేటలు ఆ పార్టీలో అందరికీ వుండవుగా! కడుపులో ఒకటి పెట్టుకుని పైకి ఇంకొకటి చెప్పలేరుగా! ఈ బాపతులోని నాయకుడే సూళ్లూరుపేట ఎమ్మెల్యే పరసా రత్నం.**

చంద్రబాబు కాంగ్రెస్‌తో పరోక్ష స్నేహాన్ని కొనసాగిస్తుంటే, పరసా రత్నం మాత్రం కాంగ్రెస్‌తో తమకున్న స్నేహబంధాన్ని బహిరంగంగా వేదికలమీదే చాటుతున్నాడు. మొన్న 14వ తేదీ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అవగాహనా కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి సూళ్లూరుపేట కొచ్చారు. ఇక్కడ సీఎంకు, ఇతర మంత్రులకు స్వాగతం పలుకుతూ కాంగ్రెస్‌వాళ్లు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో పరసా ఫోటో దర్శనమిచ్చింది. ఇక చంద్రబాబు ఎర్రటిఎండలో పాదయాత్ర చేస్తూ కిరణ్‌ను అదే పనిగా విమర్శిస్తుంటే, పరసా రత్నం మాత్రం సూళ్లూరుపేటలో సీఎం పక్కనే కూర్చుని తన ప్రసంగంలో ఆయన విధానాలను ఎంతగానో పొగిదారు. చంద్రబాబు కంటే కూడా కిరణ్ బెస్ట్ సీఎం అన్నట్లుగా మాట్లాడారు. అంతేకాదు, అదే సభలో పీసీసీ అధ్యక్షుడు బొత్స సత్యనారాయణ, చంద్రబాబును ఘాటుగా విమర్శిస్తుంటే ఆ విమర్శలను పరసా రత్నం దూకుడు సినిమా చూస్తున్నట్లుగా ఎంజాయ్ చేసారు. ఇంతేకాదు ఈమధ్య సూళ్లూరుపేటలో జరిగిన ఫ్లెమింగో ఫెస్టివల్ ముగింపు కార్యక్రమంలో కేంద్ర పర్యాటక శాఖామంత్రి చిరంజీవి పాల్గొనడం తెలిసిందే! (మిగతా 5వ పేజీలో)

# ఆత్మకూరులోనూ చెడింది!

### గౌతంకు కలిసొచ్చింది!




వై.యస్. కుటుంబం మీద మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఆత్మకూరు నియోజకవర్గంలోనూ తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇంతవరకు పార్టీలకతీతంగా మంత్రి పట్ల సానుకూల ఆలోచన వున్న వాళ్లు సైతం ఆయన వై.యస్.పై చేసిన వ్యాఖ్యలతో తమ అభిప్రాయాన్ని మార్చుకుంటున్నారు.

ఈమధ్య జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ సమన్వయకర్తలను నియమించడం జరిగింది. ఆ కోవలోనే ఆత్మకూరుకు మేకపాటి గౌతంరెడ్డిని సమన్వయకర్తగా నియమించారు. గౌతం నియామకంపై చాలామంది పెదవి విరిచారు. ఆనం ముందు గౌతం ఎక్కడ ఆనతాడని 'లాయర్' పేర్కొంది. వాస్తవంగా (మిగతా 5వ పేజీలో)

# వృక్షవిలాపం

### గతి తప్పిన పర్యావరణం



మన ఆహారం, ఆరోగ్యం, ఆర్థికవ్యవస్థ, జీవనం కేవలం ప్రకృతి వనరుల పైనే ఆధారపడి వుంది. ఈ వనరులు తగ్గిపోయినా అంతరించినా మానవాళి ఎంత కష్టపడినా భర్తీ చేయడం కష్టసాధ్యం ప్రకృతిని పునరుజ్జీవింపచేయడం దుర్లభం. పూలు, కాయలు, చెట్లు, జంతువులు పునరుత్పత్తి జరుపుకున్నా, వ్యర్థాలను తొలగించడంలో ముఖ్యపాత్ర పోషించే క్రిమికీటకాలు, జంతువులు లేకున్నా అడవులు అంతరించినా, నేల తన సహజస్వభావాన్ని కోల్పోయినా ఏర్పడే దుష్పరిణామాలు ఊహించాలంటేనే భయమేస్తోంది. అందుకే జీవవైవిధ్య పరిరక్షణకు పెద్దపీటవేసి తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా వుంది. కాని నేడు జరుగుతున్నదేమిటి? విచక్షణారహిత మానవచర్యల వల్ల సాధారణ స్థితికంటే వెయ్యిరెట్లుగా జీవవైవిధ్యం విచ్ఛిన్నమవుతోంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భావితరాల మనుగడ అత్యంత భయానకంగా తయారవుతుంది. అయితే నేటి స్థితి చూస్తుంటే ప్రకృతిపట్ల ముఖ్యంగా చెట్ల సంరక్షణ పట్ల మన నిర్లక్ష్యధోరణి ఆ భయానకస్థితి ఇప్పుడే దాపురించేటట్టుంది. రోడ్ల విస్తరణలో భాగంగా ఎడాపెడా చెట్లు నరకడంతో జాతీయ రహదారి వెంబడిగాని, నగరంలోగాని వృక్షసంపద కనుమరుగైపోయింది. ఇంతకు ముందు ప్రయాణీకులు తమ అలసట తీర్చుకునే దానికి దారిపక్క ఏచెట్టుకిందో వాహనం ఆపి కాసేపు సేదతీరి బయలుదేరేవారు. కాని ఇప్పుడు రహదారి వెంబడి కనుచూపు మేరలో వృక్షాలు కనిపించడంలేదు. మధ్యలో డివైడర్లపైభాగంలో పెంచే చిన్న పూలమొక్కలు, క్రోటన్ మొక్కలు తప్పించి పెద్దపెద్ద చెట్లు జాడే కనిపించడంలేదు. దీంతో ప్రభుత్వం తన నిబంధనలను తానే తుంగలో తొక్కినట్టయింది. చట్టాలలో వుండేదొకటయితే మన ప్రభుత్వం పాటించేదొకటి అన్నట్టుంది వ్యవహారం. చెట్లను నరకడం నేరం. (మిగతా 5వ పేజీలో)



PDF Compressor Free Version






## ఆనం వ్యాఖ్యలు దారుణం

అన్నం పెట్టిన చేతినే కొరకడం అంటే ఇదేనేమో! దివంగతనేత వై.యస్.రాజశేఖరరెడ్డి ఈ జిల్లాలో ఆనం సోదరుల రాజకీయ ఎదుగుదలకు ఎంతగానో ఊతమిచ్చారు. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డిని కూడా కాదనుకుని ఆనం సోదరులకు పెత్తనం అప్పగించారు. వై.యస్. వున్నంతకాలం ఆయన పంచె పట్టుకుని తిరిగిన ఆనం సోదరులు ఈరోజు ఆయన కుటుంబంపైనే దారుణంగా మాట్లాడడం ఘోరం. రాజకీయాలలో విమర్శలు సహజమేగాని ఇంత నీతిమాలిన విమర్శలు అర్ధరహితం.

కె.రామిరెడ్డి, బద్వేలు.

## సౌరవిద్యుత్‌పై దృష్టిపెట్టాలి

భవిష్యత్‌లో విద్యుత్ కొరత ఎక్కువకాబోతుంది. ప్రతిరోజూ కూడా కరెంట్ వినియోగం పెరుగుతుంది. కాని అందుకు తగ్గట్లుగా ఉత్పాదన పెరగడం లేదు. ప్రజలు, ప్రతిపక్షాలు మాత్రం అణువిద్యుత్ ప్రాజెక్ట్‌లొద్దు, థర్మల్ విద్యుత్ ప్రాజెక్ట్‌లు వద్దని ఆందోళన చేస్తుంటాయి. మరి ప్రభుత్వమైనా విద్యుత్‌ను ఎక్కడనుండి తెచ్చివ్వగలదు. సౌరవిద్యుత్ ఉత్పాదన పెంచాలి. విద్యుత్‌ను ఎక్కువగా వాడే కంపెనీలు, పరిశ్రమలు సొంతంగా సోలార్ ప్రాజెక్ట్‌లను ఏర్పాటు చేసుకొనేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

జె.వి.నారాయణ, నెల్లూరు.

## మతప్రచారం ఆపండి

దేశంలో మతపరమైన విషయాలకు కాలం వృధా అవుతోంది. మత బోధకులు తమ కాలాన్ని దుర్వినియోగం చేసుకోవడమే కాకుండా లక్షలాదిమంది ప్రజల విలువైన సమయాన్ని కూడా వృధా చేస్తున్నారు. మత బోధకులు మంచిని మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలి. పదివేల మందిని పోగేసి ఒక గంట వారికి ఉపన్యాసమిచ్చే దానికంటే, ఆ పదివేల మందిని రోడ్ల మీదకు తెచ్చి చెత్తను ఏరివేయిస్తే నగరాలు, పట్టణాలు క్లీన్ అండ్ గ్రీన్‌గా వుంటాయి. మతం పేరుతో మొక్కలు నాటిస్తే భావి తరాలకు అవి ఉపయోగపడతాయి.

సి.రాజీవి, నెల్లూరు.

## 'ప్రభా'తం

జాతీయ రాజకీయాలు ప్రాంతీయశక్తుల చేతుల్లోకి వెళ్ళనున్నాయి. కేంద్రంలో ఏ ప్రభుత్వాన్ని నిలబెట్టాలి, ఎవర్ని ప్రధానిని చేయాలన్నది ప్రాంతీయపార్టీలే నిర్ణయించనున్నాయి. రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలని కాంగ్రెస్‌వాళ్ల కలలు కంటున్నా, నరేంద్రమోడీని తమ ప్రధాని అభ్యర్ధిగా బీజేపీవాళ్ల ప్రచారం చేసుకుంటున్నా, వాస్తవంలో రేపటి ప్రధాని అభ్యర్ధిని నిర్ణయించేది మాత్రం ప్రాంతీయపార్టీల అధినేతలే! దేశప్రధానిని ఎంపిక చేయడంలో ప్రజల ప్రభావం అంతగా వుండకపోవచ్చు. ఎందుకంటే ప్రస్తుతం ప్రధానిరేస్‌లో వున్న నాయకులను చూస్తే అత్యధిక ప్రజా మద్దతు నరేంద్ర మోడీకే వుంది. అంత మాత్రాన బీజేపీకి పూర్తి మెజార్టీ వచ్చేది లేదు. మోడీ ప్రధాని అయ్యేదీ లేదు. అలాగే కాంగ్రెస్‌కూ పూర్తి మెజార్టీ రాదు. రాహుల్ కూడా ప్రధాని కాలేడు.

ఈసారి కాంగ్రెస్‌నో, బీజేపీనో కేంద్రంలో అధికారపీఠం మీద కుర్చోపెట్టేందుకు ప్రాంతీయపార్టీలు సిద్ధంగా లేవు. దీనికి ప్రధాన కారణం సిబిఐ. ప్రస్తుతం అధికారంలో వున్న కాంగ్రెస్ ప్రభుత్వం సిబిఐని పావుగా వాడుకుంటూ ప్రాంతీయ పార్టీల అధినేతలను ఎంతగా ఇబ్బంది పెడుతుందో చూస్తూనేవున్నాం. సిబిఐ చేతిలో వుండబట్టే యుూపిఏ ఈరోజుకు కూడా ప్రభుత్వాన్ని నడుపుతుంది. ఆ సిబిఐకి భయపడే యుూపిఏ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించడానికి సమాజ్‌వాదీ పార్టీ అధినేత ములాయంసింగ్, బహుజన సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతిలు జంకుతున్నారు. వీళ్లిద్దరి మీద సిబిఐ విచారణ వుంది. వీళ్ల యుూపిఏకు మద్దతునిస్తుండబట్టే సిబిఐని వారిమీదకు ఉసిగొల్పడం లేదు. సాక్షాత్తు ములాయంసింగ్ యాదవే సిబిఐని అడ్డం పెట్టుకుని కేంద్రంలోని కాంగ్రెస్ పెద్దలు తమను ఎలా వేధింపులకు గురిచేస్తున్నది ఏకరువుపెట్టారు. ఇక శ్రీలంకలోని తమిళుల హక్కుల విషయంలో విభేదించి యుూపిఏ ప్రభుత్వానికి డిఎంకె మద్దతు ఉపసంహరించడం తెలిసిందే. ఇది జరిగిన పక్కరోజే కరుణానిధి కుమారుడు స్టాలిన్ ఇంటి మీద సిబిఐ దాడులు జరిగాయి. అంటే తమతో విభేదించిన వారిని సిబిఐని అడ్డంపెట్టుకుని కాంగ్రెస్ ఎంతగా వేధిస్తుందోననడానికి ఇదో ఉదాహరణ. కాంగ్రెస్ అధిష్టానంతో విభేదించి, సోనియాగాంధీ ఆధిపత్యానికి సవాల్ విసిరిన వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి జైలుకెళ్లి పదినెలలవుతుంది. ఆయనపై సిబిఐని ఎంతబలంగా వాడుకుంటున్నారో లోకం చూస్తూనే వుంది.

ఇలా కేంద్రంలో వున్న ఓ జాతీయపార్టీ అధికారం ముసుగులో సిబిఐని అడ్డం పెట్టుకుని ప్రాంతీయపార్టీలను వేధింపులకు గురిచేయడంతో ప్రాంతీయపార్టీల ఏకీకృతానికి దారితీసింది. అటు కాంగ్రెస్, ఇటు బీజేపీలకు వ్యతిరేకంగా ప్రాంతీయపార్టీలన్నీ ఒకేతాటిపైకి రావడానికి మార్గం సుగమం అయ్యింది. ప్రాంతీయపార్టీల నుండే ప్రధాని అభ్యర్ధిని ఎంపిక చేయాలన్నది వాటి భవిష్యత్ రాజకీయ ఎజెండా!

వచ్చే లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్, బీజేపీలు సొంతంగా మెజార్టీని సాధించలేవు. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదిపార్టీ, బహుజన సమాజ్‌పార్టీ, బీహార్‌లో జనతాదళ్(యు), ఒరిస్సాలో బిజూజనతాదళ్, పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, మహారాష్ట్రలో ఎన్సీపి, ఆంధ్రప్రదేశ్‌లో వైయస్సార్ కాంగ్రెస్, తమిళనాడులో డిఎంకె, అన్నా డిఎంకె, కర్నాటకలో దళ్(ఎస్) నిర్ణయాత్మక శక్తులు కానున్నాయి. వీటిలో అన్నాడిఎంకె, తృణమూల్ కాంగ్రెస్ బీజేపీతో చేతులు కలిపే అవకాశాలున్నాయి. ఎందుకంటే తృతీయ కూటమిలోకి వామపక్షాలు, డిఎంకె వస్తే వాటిని వ్యతిరేకించే ఈ రెండుపార్టీలు అక్కడ ఇమడలేవు. అలాగే బీజేపీ ప్రధాని అభ్యర్ధిగా నరేంద్రమోడీని ప్రకటిస్తే మాత్రం దళ్(యు) మూడో కూటమిలోకి వస్తుంది. మోడీని కాకుండా ఇంకెవరినన్నా ప్రధాని అభ్యర్ధిగా ప్రకటిస్తే మాత్రం బీజేపీతోనే వుంటుంది.

ఏ పార్టీకి లేదా ఏ కూటమికి మెజార్టీ రాదన్నది నిస్సందేహం. అప్పుడు ఎవరి మద్దతుతో ఎవరు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారన్నది పెద్ద ప్రశ్నే. ఈసారి కూడా కాంగ్రెస్ చేతికి అధికారాన్ని ఇవ్వడానికి ప్రాంతీయపార్టీలు అంగీకరించవు. కాబట్టి బీజేపీ నుండి నరేంద్ర మోడీ కాకుండా ఇంకెవరిని ప్రధాని అభ్యర్ధిగా ప్రకటించినా దళ్(యు)తో పాటు సమాజ్‌వాదీ, బిజూజనతాదళ్, వైకాపా వంటి పార్టీలు మద్దతు పలికే అవకాశాలున్నాయి. దళ్(యు) ఇప్పటికే ప్రధాని అభ్యర్ధిగా అద్వానీకి మద్దతు ప్రకటించింది.

బీజేపీని అధికారంలోకి రాకుండా చేసేందుకు కాంగ్రెస్ గేమ్‌ప్లాన్ ఆడొచ్చు. పాత సంప్రదాయం ప్రకారమే ప్రాంతీయపార్టీల నుండే ప్రధాని అభ్యర్ధిని తెరమీదకు తేవచ్చు. కాంగ్రెస్ ఆ ప్రభుత్వానికి మద్దతు పలికి కొంతకాలం సాగనిచ్చి ఆ తర్వాత కూలదోయవచ్చు. అప్పుడు మళ్లీ మధ్యంతర ఎన్నికలే!

ఈసారి ఎన్నికలకు ముందే బలంగా వున్న ప్రాంతీయపార్టీలన్నీ ఒకే వేదికమీదకు రానున్నాయి. ఈ దేశానికి తదుపరి ప్రధాని ఎవరన్నది ఖచ్చితంగా ఆ ప్రాంతీయ శక్తులే తేల్చనున్నాయి.

అప్పటిదాకా ప్రధాని రాహుల్‌గాంధీయా... నరేంద్ర మోడీనా అన్నది పత్రికలు, ఎలక్ట్రానిక్ ఛానళ్ల విశ్లేషణలు సాగడానికే!

### ప్రాంతీయ శక్తులు



దేశంలో ప్రాంతీయశక్తులు బలపడుతున్నాయి. కాంగ్రెస్, బీజేపీలు బలహీనపడ్డాయి. ఏ పార్టీకి పూర్తిమెజార్టీ రాని వాతావరణం నెలకొన్న నేపథ్యంలో కేంద్రంలో భవిష్యత్ ప్రభుత్వం ఏదనేది ప్రాంతీయపార్టీలే నిర్ణయించబోతున్నాయి. ఒక రకంగా అవే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నాయి.

## 'అంతర్'జాతీయం

- సుప్రీంకోర్టు మాజీన్యాయమూర్తి జస్టిస్ ఒ.చిన్నపరెడ్డి(91) ఈ నెల 13న హైదరాబాద్‌లో కన్నుమూసారు. అనంతపురం జిల్లాకు చెందిన చిన్నపరెడ్డి 1944లో న్యాయవాద వృత్తిని చేపట్టి వివిధ హోదాలలో పనిచేసారు. పంజాబ్, హర్యానా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులలో న్యాయమూర్తిగా పనిచేసారు. 1978లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులై, 1987లో పదవీవిరమణ చేసారు.
- అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా 2012 సంవత్సరానికి 3కోట్ల 5లక్షల ఆదాయాన్ని అందుకోగా అందులో 18.4శాతం(56లక్షలు) పన్నుల రూపంలో చెల్లించారని వైట్‌హౌస్ తెలిపింది.
- 1993 ఢిల్లీ బాంబుపేలుడు కేసుకు సంబంధించి నిందితుడు దేవేందర్ పాల్ సింగ్ భుల్లర్‌కు క్షమాభిక్ష ప్రసాదించాలని ప్రెస్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మెన్ మార్కండేయ కట్జూ రాష్ట్రపతికి విజ్ఞప్తి చేశారు.
- మన దేశంలో ఢిల్లీ తర్వాత బెంగుళూరులో ఏర్పాటుచేసిన రెండో మధ్యవర్తిత్వ కేంద్రం(ఆర్బిట్రేషన్ సెంటర్)ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అల్తమస్ కబీర్ 14వ తేదీ ప్రారంభించారు. భారత కార్పొరేట్ సంస్థలకు సంబంధించిన జాతీయ, అంతర్జాతీయ వాణిజ్య వివాదాలను ఈ కేంద్రం పరిష్కరించాలని ఆయన సూచించారు.
- భారత టెన్నిస్ ఆటగాళ్ల అసోసియేషన్ ఉపాధ్యక్షురాలిగా సానియామిర్జా నియమితురాలైంది. ఇప్పటికే ఈ అసోసియేషన్‌లో లియాండర్ పేస్, మహేష్ భూపతి, సోమదేవ్‌వర్మలు ఉపాధ్యక్షులుగా వున్నారు.
- వెనిజులా అధ్యక్షుడిగా సోషలిస్ట్ పార్టీ నేత ముదురో(50) ఎన్నికయ్యారు. చావెజ్ ఆకస్మిక మృతితో జరిగిన మధ్యంతర ఎన్నికలలో ఆయన తన ప్రత్యర్ధి జస్టిస్ ఫస్ట్ నేత హెన్రిక్ కాప్రివిస్(40)పై గెలుపొందారు.
- వివాదాస్పద అయోధ్య స్థలంలో ఈసారి శ్రీరామనవమి వేడుకలకు ఫైజాబాద్ జిల్లా యంత్రాంగం అనుమతించలేదు. 64ఏళ్లుగా ఇక్కడ సీతారాముల కల్యాణోత్సవం నిర్విఘ్నంగా జరుగుతుంది. వివాదాస్పద ప్రాంతాలలో ఎటువంటి ధార్మిక కార్యక్రమాలు నిర్వహించరాదని సుప్రీంకోర్టు గతంలో ఆదేశించిన నేపథ్యంలో అధికార యంత్రాంగం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది.
- ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మంగళవారం ఉదయం 8గంటల సమయంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పదిమంది మావోయిస్టులు చనిపోయారు. ఆంధ్రప్రదేశ్ ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కిష్టాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఎదురుకాల్పుల్లో పదిమంది చనిపోగా దీంతో ఖమ్మం, కరీంనగర్, వరంగల్ జిల్లాల ప్రాంతీయ మావోయిస్టు దళం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయినట్లైంది.

## వార్త వ్యాఖ్య

వార్త :- దరిదాపుల్లో ఎన్నికలు. - శరద్‌పవార్.
వ్యాఖ్య :- *అభ్యర్థులను కోట్లు, ప్రజలను ఓట్లు రెడీ చేసుకోమంటారు.*

వార్త :- పసిడి పడిపోతుంది. - కనిష్ఠస్థాయికి బంగారం ధరలు.
వ్యాఖ్య :- *పెరుగుట విరుగుట కొరకే అంటే ఇదేనేమో!*

వార్త :- ఎస్సీ, ఎస్టీలు గుడిసెల్లో లేకుండా చూస్తాం. - కిరణ్‌కుమార్‌రెడ్డి.
వ్యాఖ్య :- *చెట్ల కింద వుండాల్నా?*

వార్త :- ముందస్తు భాయం. - బీజేపీ అగ్రనేత వెంకయ్య.
వ్యాఖ్య :- *ఎన్నికలొస్తే పోటీ చేసేవాళ్లకు తెలుస్తుంది నొప్పి... మీకు ఎన్నికలంటే తమాషాగానే వుంటుంది.*

వార్త :- జైళ్లు అత్తగారింటితో సమానం. - ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ.
వ్యాఖ్య :- *జైలర్లు మామలా?*

వార్త :- ఎన్నికలకు సిద్ధం కండి. - జేపీ.
వ్యాఖ్య :- *ఓట్లకు నోట్లివ్వడానికి కూడా సిద్ధంకావాలి.*

వార్త :- 27లోపు టీఆర్‌ఎస్‌లో చేరండి. - టీకాంగ్రెస్ ఎంపీలకు కేసీఆర్ పిలుపు.
వ్యాఖ్య :- *ఆఫర్ ఎంతో చెబితే పోలా!*

వార్త :- ఏపీలో ఏం జరుగుతోంది? - రాష్ట్రంలో పరిణామాలపై సోనియా ఆందోళన.
వ్యాఖ్య :- *మరీ ఎక్కువ తెలుసుకోకండి... అసలే మీ ఆరోగ్యం బాగలేదు.*

వార్త :- తిరుపతిలో మద్యం దుకాణాలెన్ని? - నివేదిక కోరిన హైకోర్టు.
వ్యాఖ్య :- *అలానే బెల్టుషాపుల గురించి కూడా...*

వార్త :- రాజకీయాల్లో చేపలవేట తగదు. - కేసీఆర్‌పై సీపీఐ నారాయణ ఫైర్.
వ్యాఖ్య :- *ఆయనది చేపల వేట కాదు పిట్టల వేట.*

వార్త :- చంచల్‌గూడ జైలు వైసిపి కార్యాలయమైంది. - వి.హెచ్.
వ్యాఖ్య :- *పోనీలే... ప్రభుత్వం పుణ్యాన వారికి కార్యాలయం బాదుగ కట్టే పని తప్పింది!*

వార్త :- తెలుగుదేశంకి ఈసారి కూడా ప్రతిపక్షమే. - కిరణ్.
వ్యాఖ్య :- *అంటే మీకు ప్రధానప్రతిపక్ష హోదా కూడా రాదన్నమాట!*

PDF Compressor Free Version



# ఆధార్ నమోదుకు ఇంటింటికి వెళ్లండి

నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం సమావేశ మందిరంలో ఈనెల 15న ఆధార్ నమోదు సిబ్బంది, పరిశీలకులతో ఇన్‌చార్జి కమీషనర్ సంపత్‌కుమార్ సమావేశమై ఆధార్ నమోదుకు సంబంధించి పలు సూచనలు చేసారు. నగరంలోని ప్రతి ఇంటికి వెళ్ళి ఆధార్ నమోదు చేసుకున్నారా? లేదా? అడిగి, నమోదు చేయించుకోని వారికి దరఖాస్తులు ఇవ్వాలని వారికి తెలిపారు. ఆధార్ కేంద్రానికి వెళ్ళాల్సిన తేదీ, సమయాన్ని, ధృవీకరణ పత్రాలను దరఖాస్తుదారులకు తెలపాలన్నారు. ఆధార్ నమోదు ప్రక్రియలో ఎటువంటి ఆరోపణలకు తావివ్వకుండా సిబ్బంది పనిచేయాలని, లేకుంటే విధుల నుంచి వారిని తొలగిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ రాజేంద్రప్రసాద్, స్టేట్ కోఆర్డినేటర్ ఫణి, జిల్లా మేనేజర్ కిషోర్, టెక్స్ మార్ట్ సిబ్బంది, ఆర్గనైజర్లు, పరిశీలకులు పాల్గొన్నారు.

# లోక్‌సత్తా నూతన కార్యవర్గం

లోక్‌సత్తా పార్టీ నెల్లూరుజిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. మార్చి 6నుండి ఈనెల 14 వరకు జరిగిన ఎన్నికల ప్రక్రియలో సంప్రదాయ పార్టీలకు భిన్నంగా అందరికీ అవకాశం కల్పించామని నూతన అధ్యక్షులు మక్కెన అంకయ్య చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చిన తనకు జిల్లా బాధ్యతలు అప్పగించారని, ఒక బలహీన వర్గానికి చెందిన కటారి శ్రీనివాసరావుని రాష్ట్ర అధ్యక్షుడిగా, నర్రా శ్రీధర్‌ను రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికచేయడం లోక్‌సత్తా ఆదర్శానికి నిదర్శనమన్నారు. జిల్లా ఉపాధ్యక్షులుగా యం.కె.రెడ్డి, ఎస్‌డి రసూల్, యం.శ్రావణ్‌లు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా యం.యస్.మణియాదవ్, కార్యదర్శులుగా ఎస్.ఎస్.నాయుడు, సి.పి. బాబురావు, ఎస్‌కె ఇస్మాయిల్, ఎస్‌కె షబ్బీర్‌ను ఎన్నుకున్నారని తెలిపారు.

# కొత్తూరులో హత్య

నెల్లూరు రూరల్ మండలం కొత్తూరు పరిధిలోని టైలర్స్‌కాలనీలో కాపురముంటున్న షేక్ సల్మాన్(18) సోమవారం రాత్రి దారుణహత్యకు గురయ్యాడు. పాత కక్షలు ఉన్న కారణంగా సల్మాన్‌ను కరీముల్లా, సాదిక్, హుస్సేన్, యాకూబ్ అనే వారు హత్యచేసినట్లు నెల్లూరురూరల్ ఎస్సై వెంకట్రావు తెలిపారు. సంఘటనాస్థలానికి రూరల్ సిఐ సుధాకర్‌రెడ్డి చేరుకుని విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వెంకట్రావు తెలిపారు.

# సారథి మారేనా?

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ కోణంలోనైతేనేమి డి.యస్.కే పీసీసీ సారథ్యం అప్పగించే అవకాశాలు ఎక్కువగా వున్నాయి. తనను పీసీసీ నుండి తొలగిస్తే, దానికి తగ్గ పదవిని ఇవ్వాలనే కోరిక బొత్స సత్యనారాయణలో వుంది. సిబిఐ ఛార్జ్ షీటు నేపథ్యంలో హోంమంత్రి పదవి నుండి సబితా ఇంద్రారెడ్డి తప్పుకుంటారనే ప్రచారం జరుగుతుంది. ఆమె తప్పుకుంటే హోంను తనకివ్వాలని బొత్స అడుగుతున్నారు. ఎన్నికల లోపు సీఎంను మార్చే అవకాశాలు కనిపించడం లేదు. ఒకవేళ సీఎంను మారిస్తే ఈసారి ఆ అవకాశం తెలంగాణ నాయకులకు ఇవ్వొచ్చు. పీసీసీ అధ్యక్షుడుగా.. ఈమధ్య జగన్ మీదకు మంచి దూకుడు మీదపోతున్న ఆనం రామనారాయణరెడ్డిని నియమించే అవకాశముంది. అయితే ఈ ఛాన్స్ తక్కువ. పీసీసీలో మాత్రం మార్పు ఖాయంగా వుందొచ్చు.

# ఇదేం పని!

(3వ పేజీ తరువాయి)

ఆ సభలోనూ పరసా... నేను చిరంజీవి అభిమానినేనని గత ఎన్నికలలో తిరుపతిలో తన ఓటును చిరంజీవికే వేసానని చెప్పుకొచ్చారు. ఈయన సూళ్లూరుపేట తెలుగుదేశం అభ్యర్థి... తిరుపతిలోనూ తెలుగుదేశం అభ్యర్థి వున్నారు. మరి తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేసుకోకుండా ఇంకో పార్టీకి ఓటేసాడంటే ఆయనను ఏమనుకోవాలి. ఒకవేళ ఓటేసినా అంత బహిరంగంగా ఆ విషయాన్ని చెప్పాక కూడా దీనిపై చంద్రబాబు సీరియస్‌గా స్పందించలేదంటే ఆయననేమనుకోవాలి. పార్టీలో నెలకొన్న క్రమశిక్షణా రాహిత్యానికి, నిరుత్సాహ వాతావరణానికి పరసా ఉదంతాలే ఉదాహరణలు.

# ఆత్మకూరులోనూ చెడింది

(3వ పేజీ తరువాయి)

ఆరోజుకు ఆత్మకూరులో వున్న వాతావరణమదే! జగన్ అభిమానులు, వై.యస్. సానుభూతిపరులు కూడా ఆనం పట్ల గౌతం మధ్య పోటీ వచ్చేసరికి ఆనంవైపే ఎక్కువగా మొగ్గుచూపే పరిస్థితి. కారణం ఇక్కడ పైస్థాయిలో పార్టీలకంటే అభ్యర్థులకు ప్రాధాన్యత పెరగడం. వ్యక్తిగతంగా తీసుకుంటే గౌతం కంటే ఆనం రామనారాయణరెడ్డి గట్టి నాయకుడు. మంత్రిగా ఈ నాలుగేళ్లలో ఆత్మకూరు నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేసారు. వందలకోట్లు నిధులు తెచ్చారు. నియోజకవర్గంలోని ప్రతిగ్రామంలో పనులు చేసివున్నారు. ఇవన్నీ మంత్రి పట్ల నియోజకవర్గ ప్రజలలో సానుకూల ఆలోచనను పెంచాయి. ఎంత జగన్ గాలి వున్నా చేసిన అభివృద్ధి మూలంగా ఆనంకు ఓట్లేస్తారనే వాతావరణం వుండింది.

కాని ఆ వాతావరణం ఒక్కసారిగా చెడిపోయింది. వై.యస్. కుటుంబంపై ఆనం రామనారాయణరెడ్డి చేసిన వ్యక్తిగత విమర్శలు ఇక్కడ ప్రజలలో ఆగ్రహావేశాలు తెచ్చాయి. మొన్నటివరకు పార్టీలను పట్టించుకోకుండా ఆనంకు అండగా నిలవాలనుకున్న వారు కూడా ఒక్కసారిగా రివర్సవుతున్నారు. ఆనం వ్యాఖ్యలు అనుకోని విధంగా రేపటి ఎన్నికలలో గౌతంకు వరం కానున్నాయి.

# మంత్రి నోరు అదుపులో పెట్టుకోవాలి

**- ప్రసన్నకుమార్‌రెడ్డి**



కోవూరు మండలంలోని చౌకచర్ల గ్రామంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి ఈనెల 16న విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పదవి పొందాలని సోనియాగాంధీ మెప్పుకోసం రాష్ట్ర ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డి వైయస్ కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేసారన్నారు. మంత్రి నోరు అదుపులో పెట్టుకోవాలి, లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. దివంగత మహానేత వైయస్ రాజశేఖరరెడ్డి అండతో రాజకీయంగా బలపడిన ఆనం కుటుంబీకులు రేపటి ఎన్నికల్లో రాష్ట్రంలో ఎక్కడ పోటీకి నిలబడినా తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ఆనం ఆధ్వర్యంలో జరిగే ఏ ప్రభుత్వ కార్యక్రమంలోనూ జిల్లాలో వైయస్సార్సీపీ ఎమ్మెల్యే, ఎంపీలు పాల్గొనబోరని ప్రకటించారు.

సమావేశంలో వైయస్సార్సీపీ నాయకులు ఓగు నాగేశ్వర రావు, చేవూరు రాంప్రసాద్, కొండూరు వెంకటసుబ్బారెడ్డి, అయ్యప్ప, తాతా ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

# రైతు సంఘం కృషి అభినందనీయం

**- ఎమ్మెల్యే పి.రామకృష్ణారెడ్డి**



నెల్లూరుజిల్లా రైతు సంఘం కార్యాలయంలో ఈనెల 16న మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి నెల్లూరుజిల్లా రైతు సంఘం చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. రైతులకోసం నిరంతరం పని చేయాలని చెప్పే వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటలను రైతుసంఘం పాటిస్తోందని, దానికి కావలసిన సహకారాన్ని తాను అందించడానికి సిద్ధంగా వున్నానన్నారు. కావలి కాలువ ఆయకట్టులో వున్న నలభైవేల ఎకరాల్లో ఎక్కువ భాగం ఎండిపోకుండా రైతు సంఘం కృషి చేయడం ఎంతో సంతోషమని అన్నారు. అలాగే చెరువుల ఆక్రమణలను తొలగించడానికి రైతు సంఘం చేస్తున్న పోరాటానికి తన సహకారం ఎల్లప్పుడూ వుంటుందన్నారు. మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి మాచర్లలో 100కోట్లతో ఆసియాలోనే అతిపెద్ద మిర్చియార్డుకు అనుబంధంగా యార్డు నిర్మించేందుకు హామీ ఇచ్చారని ఆయన మరణానంతరం సిఎం అయిన రోశయ్య దానికి శంకుస్థాపన చేసారేకాని పనిమాత్రం ప్రారంభించలేదన్నారు. రైతుసంఘం అధ్యక్షుడు మలిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని చెరువుల అక్రమణలు తొలగించేందుకు తమ సంఘం పోరాటం ఉధృతం చేస్తుందన్నారు. కావలి కాలువ సామర్థ్యం 550 నుంచి 1300క్యూసెక్కులను పెంచేందుకు కృషిచేస్తామని తెలిపారు.

# అభిమానం తాకట్టు

(మొదటిపేజీ తరువాయి)

అసలు విషయానికొస్తే ఈమధ్య రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరులో విలేకరుల సమావేశం పెట్టి వై.యస్. కుటుంబంపై దారుణంగా విమర్శలు చేసారు. ఆయన నోట వచ్చిన మాటలు విని రాష్ట్ర ప్రజలే కాదు, తెలుగుదేశం, బీజేపీ, వామపక్షాల నేతలు, కార్యకర్తలు సైతం విస్తుపోయారు. ఎందుకంటే వై.యస్.ను ఇతర పక్షాలు విమర్శించడంలో తప్పులేదు. కాని ఇక్కడ ఆనం విమర్శించడమే సంచలనంగా మారింది.

వై.యస్.కు ఆనం సోదరులకు మధ్య ఎంతటి స్నేహసంబంధాలు వుండేవన్నది లోకానికి తెలిసిందే! జిల్లా కాంగ్రెస్‌పార్టీలో నేదురుమల్లి ప్రత్యర్థులుగా, వై.యస్. వర్గీయులుగా ఆనం సోదరులకు బలమైన ముద్రపడింది. తాను ముఖ్యమంత్రిగా వున్నకాలంలో జిల్లాలో ఆనం సోదరులు పూర్తిస్థాయిలో ఎదిగేందుకు, జిల్లా పార్టీ పెత్తనాన్ని పూర్తిగా వారి చేతుల్లో పెట్టేందుకు సంపూర్ణంగా సహకరించాడు వై.యస్. ఇక అసెంబ్లీ టిక్కెట్ల విషయంలోనూ, ఇతర ఎన్నికలలో టిక్కెట్ల పంపిణీలోనూ ఆనం సోదరుల మాటకే ప్రాధాన్యతనిచ్చాడు. తన కేబినెట్‌లో రెండుసార్లు మంత్రిగా రామనారాయణరెడ్డికి అవకాశమిచ్చాడు. వై.యస్. బ్రతికున్నంత కాలం ఆనం సోదరులు ఆయనకు వీరవిధేయులుగానే నటించారు. వై.యస్. మరణానంతరం జగన్‌ను సీఎంను చేయాలంటూ ఢిల్లీలోని టెన్‌జనపథ్‌కు వినిపించేలా ఎలుగెత్తి అరిచింది వీళ్లే! కాని అధిష్టానం ఎప్పుడైతే జగన్ విషయంలో వ్యతిరేక ధోరణితో ఆలోచించ సాగిందో, అప్పుడే వీరి ఆలోచనా ధోరణి కూడా మారిపోయింది. వై.యస్. మమ్మల్ని కాంగ్రెస్ భక్తులుగా తీర్చిదిద్దారని మొదలుపెట్టి, ఇప్పుడు అదే వై.యస్.ను విమర్శించే స్థాయికి ఆనం సోదరుల రాజకీయ చేరింది.

దీనినంతా తీసి పక్కనపెడితే, ఇప్పుడు జగన్ జైలులో వున్నాడు. విజయమ్మ పార్టీ కార్యక్రమాలు నడుపుతున్నారు. షర్మిల పాదయాత్రలో వున్నారు. వాళ్లెక్కడా వ్యక్తిగత విమర్శలు చేయడం లేదు. అసలు ఆనం సోదరులను పల్లెత్తుమాట కూడా అనలేదు. గత ఉపఎన్నికల సమయంలో నెల్లూరుజిల్లాలో జరిగిన ఓ ఎన్నికల ప్రచారసభలో షర్మిల ఆనం సోదరుల ప్రస్తావన తేబోయినా విజయమ్మ వెంటనే వారించింది. ఆనం సోదరుల విషయంలో ఆ కుటుంబసభ్యులు అంత హుందాగా వ్యవహరిస్తే, మరి ఆనం రామనారాయణరెడ్డి ఎందుకు మిడిసిపాటుతో ఆ కుటుంబాన్ని ఆడిపోసుకున్నట్లు?

దీనికి అనేక కారణాలున్నాయి. వై.యస్.పై విమర్శలు చేసాక ఆనం ఆశించిందే జరుగుతూ వస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఆనం దిష్టిబొమ్మలను తగలబెట్టారు. ఆయనపై నిరసనలు పెల్లుబికాయి. పత్రికలు, టీవీల నిండా ఆయన వార్తలే. రాష్ట్ర కేబినెట్ రెండుగా చీలిపోయింది. కళంకిత మంత్రులంతా ఆనంకు మద్దతుగా నిలిచారు. ఆయన మాటలను సమర్థించారు. ఇన్నాళ్లకు కాంగ్రెస్‌పార్టీకి ఒక కథానాయకుడు దొరికాడని అంటున్నారు. వై.యస్.పై ఆనం ఘాటు వ్యాఖ్యల వెనుక అసలు లక్ష్యం ఢిల్లీలోని అధిష్టాన దేవతను మెప్పించడమే! వై.యస్.ను, జగన్‌ను ఎంత ఘాటుగా తిడితే సోనియా అంత హ్యాపీగా ఫీలవుతుంది. ఎందుకంటే జగన్ ఆమెలో అంతర్లీనంగా దాగున్న తెల్లజాతి అహంకారాన్ని దెబ్బకొట్టి వున్నాడు. ఆమె కసితో రగిలిపోతుంది. ఆమెలోని ఈ బలహీనతను పసిగట్టే ఆనం ఈ సాహసానికి ఒడికట్టాడు. ఒక్కసారిగా ఆయన పేరు ఢిల్లీ దాకా వెళ్లింది.

వై.యస్. పైన, జగన్‌పైన ముఖ్యమంత్రి కిరణ్ కూడా ఘాటుగా మాట్లాడలేకున్నారు. ఇంకెవరూ మాట్లాడే నాయకులు కూడా లేరు. పిల్లి మెడలో గంట ఎవరు కట్టాలనే మీమాంస ఇంతవరకు వుండేది, ఆ గంటను ఇప్పుడు ఆనం కట్టారు. ఆయన టార్గెట్ అధిష్టానాన్ని మెప్పించడం. అది పూర్తయినట్లే. రేపు ముఖ్యమంత్రిని మార్చాలనే ఆలోచన అధిష్టానానికి వస్తే, వారికి వెంటనే వచ్చే ఆలోచన ఆనం రామనారాయణరెడ్డి. ఒకవేళ ముఖ్యమంత్రి దాకా సీన్ రాకపోయినా సిబిఐ ఛార్జ్‌షీట్ మూలంగా సబితా ఇంద్రారెడ్డి హోంమంత్రి పదవి నుండి వైదొలిగితే, ఇన్‌ఛార్జ్ హోంమంత్రి కావాలనేది ఆనం కోరిక. మనసులో ఇన్ని ఆలోచనలు వుండబట్టే ఆయన తన మనస్సాక్షిని చంపుకుని వై.యస్.ను తూలనాడాడు. పార్టీలో క్రేజ్ పెంచుకుని ప్రజలలో ఇమేజ్ పోగొట్టుకున్నాడు.

# వృక్ష విలాపం

(3వ పేజీ తరువాయి)

ఒకవేళ ప్రజోపయోగార్థం అవసరమైతే ఆ శాఖ అధికారుల అనుమతితో మాత్రం చెట్లను తొలగించాల్సి వుంటుంది. తొలగించినా దాని బదులు మరొక చోట మొక్కను ప్రత్యామ్నాయంగా నాటి సంరక్షించాలి. కాని ఇప్పుడు చెట్లను నరికివేయడమే కనిపిస్తుంది గాని పెద్దవృక్షాలకు సంబంధించి మొక్కలను రహదారుల వెంబడి నాటడం గాని, సంరక్షించడంగాని కనిపించడంలేదు. దీనిఫలితం ఇప్పటికే మన అనుభవంలోకి వచ్చి నానాతంటాలు పడుతున్న సంగతి తెలిసిందే. అటు ప్రభుత్వం ఇటు ప్రజలు సమష్టిబాధ్యతగా భావించి విచక్షణారహిత చర్యలకు తిలోదకాలిచ్చి బాధ్యతాయుతంగా వ్యవహరించడం అవసరం. తక్షణమే తగు చర్యలు తీసుకుంటే మంచిది.

# కాంగ్రెస్ ఖాళీ

(మొదటిపేజీ తరువాయి)

అధినేత కేసీఆర్ బంపర్ ఆఫర్ ప్రకటించారు. ఈ నెల 27లోపు టీఆర్ఎస్‌లో చేరేకాంగ్రెస్ నాయకులకు వారి సీట్లు వారికే ఇస్తామన్నట్లు చెప్పారు. దీంతో టీ–కాంగ్రెస్ నేతలలో కదలిక మొదలైంది. కేశవరావు, మందా జగన్నాథం, సుఖేందర్ రెడ్డి, కోమటిరెడ్డి బ్రదర్స్ వివేక్, పొన్నం ప్రభాకర్ వంటివాళ్లు జెండా ఎత్తడానికి సిద్ధంగా వున్నారు. కాంగ్రెస్ అధిష్టానం జోక్యం చేసుకుని టీఆర్ఎస్‌లోకి వలసలను నిరోధించేందుకు తంటాలు పడుతుంది. అయితే అధిష్టానం ఎంతగా ప్రయత్నించినా తెలంగాణలో కాంగ్రెస్ పతనాన్ని అడ్డుకోలేదు.

PDF Compressor Free Version





ఈ నెల 16వ తేదీన నెల్లూరులోని కెవిసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'అమ్మహస్తం' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర ఆర్థికశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పక్కన ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్, జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం తదితరులు

# నెల్లూరు కబుర్లు

• వ్యాపారుల్లో ఆందోళన

## పసిడి పతనం

అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చితి ప్రభావం దేశీయ బులియన్ మార్కెట్ పైనాపడింది. ఫలితంగా స్టాకిస్టులు, ఇన్వెస్టర్లు సర్దుబాటుకు ప్రాధాన్యత నివ్వడంతో సోమవారం పదిగ్రాముల పసిడి ధరకు 750తగ్గి 27600వద్ద స్థిరపడింది. ఇది 2011 డిసెంబర్ నాటి ధరతో సమానం. కొంత కాలంగా ఆకాశంలో ఉన్న బంగారం ధరలు దిగిరావడంతో కొనుగోలు దారుల్లో మిశ్రమ స్పందన కనిపిస్తోంది. ధరలు తగ్గడంతో కొంత మంది కొనుగోలు దారులు కొనుగోళ్ళపై మక్కువ చూపిస్తుండడంతో బంగారు దుకాణాలు కళకళలాడుతున్నాయి. గతంలో బంగారంపై పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని ఆశించిన మదుపు దారుల్లో ఆందోళన నెలకొంది. షేర్‌మార్కెట్ పతనం, రియల్ ఎస్టేట్ వ్యాపారం సన్నగిల్లడంతో ఎక్కువ మంది మదుపుదారులు బంగారంపై పెట్టుబడులు పెట్టారు. నెలలు గడుస్తున్నా ఆశించిన మేరకు బంగారంపై లాభాలు రాకపోవడంతో బంగారాన్ని అమ్మడం ప్రారంభించారు. దీంతో బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. పరిస్థితులు ఇలాగే కొనసాగితే మరికొద్ది రోజుల్లో 24క్యారెట్ 10గ్రాములు బంగారం ధర 23వేలకు తగ్గే అవకాశం ఉన్నట్లు వ్యాపారవర్గాల అభిప్రాయం.

## కోతలకు కోత

### రెండుగంటలు సడలింపు

విద్యుత్‌కోతల వేళల్లో సుమారు రెండుగంటలు సడలించనున్నారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నగరంలో ఉదయం 9 నుంచి 11గంటల వరకు, సాయంత్రం 3 నుంచి 5గంటల వరకు ఇప్పటిదాకా విద్యుత్‌కోత విధిస్తున్నారు. మునిసిపాలిటీల పరిధిలోని కావలి, గూడూరు, వెంకటగిరి, ఆత్మకూరు, సూళ్లూరుపేటల్లో 6గంటలు పాటు, మండల కేంద్రాల్లో 8గంటలు, గ్రామీణ ప్రాంతాల్లో 10గంటల పాటు కోతలు విధిస్తున్నారు. సోమవారం ప్రభుత్వ ప్రకటనతో నగరపాలక సంస్థ పరిధిలో రెండుగంటలు, మునిసిపాలిటీ పరిధిలో 4గంటలు, మండల కేంద్రాల్లో 6గంటలు, గ్రామీణ ప్రాంతాల్లో 8గంటల పాటు కోతలు విధించనున్నారు. తాజా ఉత్తర్వులు ప్రకారం ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంట కోతలు తగ్గించే అవకాశం వుంది. అయితే ఈ వేళలు గురువారం వరకు అమలులోకి రాలేదు. గురువారం నుండి కేవలం ఒక గంట మాత్రమే సడలింపు ఇచ్చి మూడుగంటల కోత విధించారు. దీంతో ఈ ప్రభుత్వం చేసిన విద్యుత్ కోతల సడలింపు ప్రకటన వట్టి కోతలేనని తేలింది.

## వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



నెల్లూరు మూలాపేటలో వెలసియున్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 20 నుండి 30వ తేదీ వరకు శ్రీ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి కుమారుడు ఆనం రంగమయూర్‌రెడ్డి తెలిపారు. సోమవారం దేవస్థానం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రంగమయూర్‌రెడ్డి మాట్లాడుతూ 20వ తేదీ అంకురార్పణతో బ్రహ్మోత్సవాల కార్యక్రమం ప్రారంభమై 30వ తేదీ ఏకాంతసేవ, ధ్వజావరోహణంతో ముగుస్తుందన్నారు. 22వ తేదీ హంసవాహనం, 24వ తేదీ వెండి హనుమంతసేవ, 27వ తేదీ రథోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కోలాటాలు, చక్కభజనలు, తెనాలి యస్.మస్తాన్ మ్యూజికల్ పార్టీ వారిచే బ్యాండుమేళం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 21 నుండి 30వ తేదీ వరకు ప్రతిరోజూ సాయంత్రం 7గంటల నుండి 9గంటల వరకు శ్రీరామాయణ ప్రవచన సుధాకర మైలవరపు శ్రీనివాసరావుచే సుందరకాండ సప్తాహం జరుగుతుందన్నారు. రాత్రి 9గంటల నుండి సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమాలకు భక్తులు విచ్చేసి శ్రీ స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు. ఈ సమావేశంలో ట్రస్టీలు మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, తుమ్మల సుబ్బారెడ్డి, మేనేజర్ కృష్ణ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నెల్లూరులో శ్రీవారి మహాప్రసాదం



క్యూ కౌంటర్ వద్ద ప్రసాద విక్రయాలు

నెల్లూరు దర్గామిట్ట టిటిడి కల్యాణమండపంలో 13వ తేదీ ఉదయం టిటిడి, హిందూధర్మ ప్రచారపరిషత్ ఆధ్వర్యంలో తిరుమల శ్రీవారి లడ్డూలను విక్రయించారు. 3వేల లడ్డూలను భక్తులకు పంపిణీ చేశారు. టిటిడి కల్యాణ మండపం మేనేజర్ రాంగోపాల్, హిందూ ధర్మప్రచారపరిషత్ సమన్వయకర్త డా॥ఎం.శ్రీహరి, ధార్మిక సలహామండలి సభ్యుడు వాకాటి విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో లడ్డూల పంపిణీ కార్యక్రమం జరిగింది. ప్రతినెల రెండవ శనివారం లడ్డూల విక్రయాన్ని నిర్వహిస్తున్నట్లు వాకాటి విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఒక్క లడ్డు ధర 25రూ॥లు చొప్పున ఒకరికి రెండు లడ్డూలను అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విబీలక్ష్మణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఏఆర్ డిఎస్పీగా శివారెడ్డి బాధ్యతలు

నెల్లూరు ఏఆర్ డిఎస్పీగా డి.శివారెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం నెల్లూరు ఏఆర్ డిఎస్పీగా పని చేస్తున్న డి.శ్రీనివాసరావును అంబర్‌పేట పోలీస్‌ట్రైనింగ్ కళాశాలకు బదిలీచేస్తూ డిజిపి దినేష్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేసారు. శివారెడ్డి పోలీస్‌శాఖలో ఏఆర్ ఎస్సైగా 1985లో అడుగుపెట్టి, 1996 నుంచి 2000 వరకు జిల్లాలో ఆర్‌ఐగా పని చేశారు. అనంతరం కాకినాడలో ఆర్‌ఐగా పని చేశారు. 2010లో డిఎస్పీగా పదోన్నతి పొందారు. అప్పటినుంచి ఏపి పోలీసు అకాడమీ (అప్పా) డిఎస్పీగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

## చిరు స్వరసమరం విజేతగా సర్వేపల్లి శ్రేయ



సప్తగిరి ఛానల్‌లో సంవత్సరం నుంచి ప్రసారమవుతున్న చిరు స్వర సమరం పాటల పోటీల కార్యక్రమ విజేతగా నెల్లూరుకు చెందిన డా॥ సర్వేపల్లి అజయ్‌కుమార్ - డా॥ లక్ష్మీ శారదల కుమార్తె సంగీత కళాకారిణి చిన్నారి సర్వేపల్లి శ్రేయ నిలిచింది. 2012 జనవరి నుంచి ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. నెల్లూరు నుంచి శ్రేయ పాల్గొని ప్రథమస్థానంలో నిలిచింది. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సర్వేపల్లి శ్రేయకు ప్రముఖులు బహుమతిని అందజేసారు.

## జాతీయ అవార్డు సాధించిన నెల్లూరీయుడు

తూర్పు గోదావరి జిల్లా రాజోలులో గత ఆదివారం రాజోలు చిత్ర కళా పరిషత్ 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన జాతీయస్థాయి చిత్రకళా పోటీల్లో నెల్లూరుకు చెందిన చిత్రకారుడు మన్నం సుందరబాబుకు "హైలీ కమాండెడ్" అవార్డు లభించింది. అతి తక్కువ సమయంలో స్పాట్ పెయింటింగ్ కాంపిటీషన్‌లో సుందరబాబు సృజనాత్మకంగా చిత్రించిన "మోడరన్ గణపతి" ద్వితీయ స్థానంలో నిలిచి అవార్డు దక్కించుకున్నారు. ఈ వివరాలను సుందరబాబు సోమవారం తెలియజేశారు.

## ఏఆర్ ఆర్‌ఎస్‌ఐకి రాష్ట్రస్థాయి అవార్డు

నెల్లూరు ఏఆర్‌ఎస్‌ఐగా పనిచేస్తున్న మహమ్మద్ రఫీ రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి డ్యూటీమీట్‌లలో ప్రతిభ కనపరచి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించాడు. ఎస్పీ బి.వి.రమణకుమార్ గ్రీవెన్స్‌డేలో సోమవారం రఫీ సాధించిన కప్‌ను అధికారుల సమక్షంలో అందజేసారు.

## అథ్లెట్‌లో సయ్యద్‌కి కాంస్యం

కాకినాడలో ఈనెల 13, 14 తేదీల్లో జరిగిన అంతర్ జిల్లాల సీనియర్ అథ్లెటిక్ పోటీల్లో 10 కిలోమీటర్ల పరుగు పందెంలో జిల్లా అథ్లెట్ సయ్యద్ నూరుల్లా కాంస్య పతకాన్ని సాధించినట్లు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పూడి నరేంద్రరావు, అరిగెల ప్రభాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు.




శ్రీ షిర్డి సాయిబాబా జన్మదిన, శ్రీరామనవమి ఉత్సవములు

19-4-2013 శుక్రవారము నుండి 21-4-2013 ఆదివారము వరకు

పై దినములలో ప్రతిరోజు
ఉదయం 7 గం॥ల నుండి బాబా వారికి
మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు
12 గంటల నుండి
సామూహిక అష్టోత్తర సహస్రనామ పూజలు
జరుగును.

• పై పూజలలో పాల్గొను భక్తులు మందిర గుమస్తా వద్ద రూ.75/-లు చెల్లించి తగిన రశీదును పొంద వలసినదిగా కోరడమైనది.
• పైరోజులలో ప్రతిరోజు నాలుగుపూటలా షిరిడీ హారతులు జరుగును.
• ప్రతిరోజు సాయంకాలం 7గం॥ల నుండి సాంస్కృతిక కార్యక్రమములు జరుగును.

భక్తులు తమకు తోచిన విధముగా ధనరూపములోగాని, ద్రవ్యరూపములోగాని మందిర గుమస్తా వద్ద చెల్లించి తగిన రశీదును పొందవలసినదిగా కోరడమైనది. పై కార్యక్రమములలో భక్తులందరూ పాల్గొని బాబావారి తీర్థప్రసాదములు స్వీకరించి, వారి కృపకు పాత్రులగుదురని ఆశిస్తున్నాము.

ఇట్లు: కార్యవర్గము

శ్రీ షిర్డి సాయిబాబా మందిరము
గాంధీనగర్, ట్రంకురోడ్డు, నెల్లూరు. ఫోన్. 2327771.

PDF Compressor Free Version



సింహపురి సమాచారం

• సూళ్లూరుపేటలో

# సీఎం వరాలబాట



మహిళాసంఘాలకు చెక్కును అందజేస్తున్న ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అవగాహనా కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి ఈ నెల 14న సూళ్లూరుపేట నియోజకవర్గంలో పర్యటించారు. సీఎం పర్యటన సూళ్లూరుపేటకు బాగానే ఉపయోగపడింది. సూళ్లూరుపేటలో అభివృద్ధి పనుల కోసం ఏకంగా వందకోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. సూళ్లూరుపేట దాహార్తి తీర్చడం కోసం 75కోట్లు మంజూరు చేశారు. కాళంగినదిపై వంతెనకు 9కోట్లు, సూళ్లూరుపేట, గూడూరులలో అంబేద్కర్ భవనాల నిర్మాణానికి కోటి, నెల్లూరులో అంబేద్కర్ భవన్‌కు 3కోట్లు, కరిపేట ఎత్తిపోతల పథకానికి 10కోట్లు మంజూరు చేశారు. అలాగే పులికాట్ ముఖద్వారం పూడికతీసేందుకు నిపుణులను పంపనున్నట్లు సీఎం వెల్లడించారు.

చిత్తూరుజిల్లాలో పర్యటన ముగించుకున్న కిరణ్ సాయంత్రం 4.15గంటలకు సూళ్లూరుపేట సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ లేఅవుట్‌లో ఏర్పాటుచేసిన హెలిపాడ్‌లో దిగారు. అక్కడనుండి నేరుగా శ్రీసిటీకి వెళ్లారు. అక్కడ కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని తిరిగి సూళ్లూరుపేటకొచ్చారు. ఇక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానానికి చేరుకుని ఇందిరమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అక్కడే ఏర్పాటుచేసిన ఇందిరమ్మకలలు బహిరంగసభలో కిరణ్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేటకు వరాలను ప్రకటించారు. ఇక్కడ సభ తరువాత నేరుగా కోటపోలూరుకు వెళ్లారు. ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళికపై ఏర్పాటుచేసిన సభలో సీఎం పాల్గొని, కేవలం 11నిముషాలు మాత్రమే ఎస్సీ, ఎస్టీలతో మాట్లాడారు. ఇక్కడ కార్యక్రమం ముగిసిన అనంతరం సీఎం హెలిపాడ్‌ను చేరుకుని హెలికాప్టర్‌లో రేణిగుంటకు వెళ్లారు. ఈ పర్యటనలో పీసీసీ అధ్యక్షుడు బొత్స సత్యనారాయణ, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పితాని సత్యనారాయణ, పి.బాలరాజు, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, పరసా రత్నం, కాంగ్రెస్ నాయకులు పనబాక కృష్ణయ్య, కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మెన్ సుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 15న నెల్లూరు దర్గామిట్టలోని సెయింట్ జోసఫ్స్ స్కూల్లో ఏర్పాటు చేసిన పదవతరగతి పరీక్షా పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని సందర్శించి మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్

# అహంకారానికి కేరాఫ్ అడ్రస్ 'ఆనం'



పోలీసులతో అనిల్ వాగ్వివాదం

రాజకీయబిక్షపెట్టిన దివంగత మహానేత డా॥ వై.యస్. రాజశేఖరరెడ్డి కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డికి అధికారంతో కళ్ళు మూసుకుపోయాయని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ సమన్వయకర్త డా॥ పి.అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. నెల్లూరు గాంధీబొమ్మ వద్ద మంత్రి ఆనం వ్యాఖ్యలకు నిరసన తెలుపుతూ ఈనెల 15న ఆయన దిష్టిబొమ్మకు శవయాత్ర జరిపి హిందూ సంప్రదాయ పద్ధతిలో దహనసంస్కారాలు చేస్తున్న వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నేతలను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేసారు. ఈ సందర్భంలో డా॥అనిల్ మాట్లాడుతూ నిన్న ఒక పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర యం.పి అయిన వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఆనం అనుయాయులు తగలబెడితే స్పందించని పోలీసులు తాము శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే అడ్డుకున్నారని, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికార దురహంకారంతో పోలీసులను పంపి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ఒక్క సంవత్సరం రోజులు ఆగితే ఈ రాష్ట్రం నుండి వైయస్ కుటుంబాన్ని ప్రజలు తరిమేస్తారో లేక ఆనం కుటుంబాన్ని తరిమి కొడతారో తెలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు ముక్కాల ద్వారకానాథ్, బీరుదవోలు శ్రీకాంత్‌రెడ్డి, సంక్రాంతి కల్యాణ్, లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మునీర్ సిద్ధిక్, లెక్కల వెంకారెడ్డి, ముప్పసాని శ్రీనివాసులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అవినీతి మంత్రులకు ముఖ్యమంత్రి రక్షణ

## సిపియం రాష్ట్ర కార్యదర్శి బి.వి.రాఘవులు



సిబిఐ ఛార్జిషీటులో ఆరుగురు మంత్రుల పేర్లు ఉంటే వారిని డిస్మిస్ చేయాల్సింది పోయి అవినీతి మంత్రులకు ముఖ్యమంత్రి రక్షణ కల్పించడం దురదృష్టకరమని సిపియం రాష్ట్ర కార్యదర్శి బి.వి.రాఘవులు ఘాటుగా విమర్శించారు. సోమవారం నెల్లూరు టౌన్‌హాలులో జరిగిన భారత వ్యవసాయ కార్మికసంఘ 16వ మహాసభల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విలువలకు తిలోదకాలిస్తూ, అప్రజాస్వామిక పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఉరి తీయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు పారిశ్రామికవేత్తలు, వ్యాపారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు తప్ప పేద ప్రజల గురించి ఆలోచించడం లేదన్నారు. ఇందిరమ్మ కలల పథకం కలగానే మిగిలిపోయిందన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ క్రింద 50 యూనిట్లు వరకు బిల్లులు మాఫీ చేస్తామనడం, దళితులు చదువుకునేందుకు రూ.10లక్షలు ఇస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రమంత్రి ఆనం రామనారాయణరెడ్డి జగన్‌ను ఉరితీయాలన్న వ్యాఖ్యలపై స్పందిస్తూ వై.యస్. మరణించిన తర్వాత జగన్‌ను ముఖ్యమంత్రి చేయకపోతే అగ్నిపర్వతం బద్దలవుతుందని, అవసరమైతే రాజీనామాలకు సిద్ధమని చెప్పిన ఆయన ఇప్పుడు జగన్‌ను ఉరితీయాలని వ్యాఖ్యానించడం ఏమిటన్నారు. ఈ మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం ఆల్ ఇండియా అధ్యక్షుడు పాటూరి రామయ్య, జిల్లా అధ్యక్షులు జక్కా వెంకయ్య, సిపియం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు బి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కార్యవర్గసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
• సరికొత్త ప్రపంచస్థాయి మోడల్స్
• ఇంపోర్టెడ్ & ఇండియా ఫర్నిచర్
ఫైనాన్స్ సదుపాయము, ఆదివారం షాపు గలదు.

# నేత్రాల సంరక్షణపై అప్రమత్తంగా ఉండాలి



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న షార్ డైరెక్టర్ ఎంవైయస్ ప్రసాద్

నేత్రాల సంరక్షణపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని షార్‌డైరెక్టర్ ఎంవైయస్ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం తడలోని శ్రీసిటీ ప్రత్యేక ఆర్థిక మండలిలో శంకర నేత్రాలయను షార్ డైరెక్టర్ ప్రారంభించి మాట్లాడుతూ శ్రీసిటీ వల్ల ఉద్యోగావకాశాలు మెరుగవుతున్నాయన్నారు. నేత్రాలయ ఛైర్మెన్ ఎస్ఎస్ బద్రీనాథ్ మాట్లాడుతూ శంకర్ నేత్రాలయ దేశంలో పలుప్రాంతాల్లో విస్తరించిందన్నారు. చెన్నైలో వైద్యశాల ఉన్నప్పటికి శ్రీసిటీలో ఉన్న పరిస్థితులు నచ్చడం వల్ల దక్షిణ ఆంధ్ర ప్రజలకు అందుబాటులో ఉండేలా మరోశాఖను ఏర్పాటు చేశామన్నారు. శ్రీసిటీ యండి రవిసన్నారెడ్డి మాట్లాడుతూ అతితక్కువ వ్యవధిలో ఆసుపత్రి ఏర్పాటుకు కావలసిన అన్ని వసతులను సమకూర్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రవిసన్నారెడ్డి అతిథులకు శ్రీసిటీ అభివృద్ధిని చిత్రపటం ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో నేత్రాలయకు చెందిన భాస్కరన్ చంద్రశేఖర్, షార్‌డిప్యూటీ డైరెక్టర్ శేషగిరిరావు, భారతిదాసన్ యూనివర్శిటీ రిటైర్డ్ వైస్‌ఛాన్సలర్ మదిసుందరం, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సింహపురి సోదర సోదరీమణులకు
ఉగాది మరియు శ్రీరామనవమి శుభాకాంక్షలు
హోటల్ సుప్రభాత్ A/c
ఏకైక సెంట్రలైజ్డ్ ఏసి ప్యూర్ వెజిటేరియన్
ఫ్యామిలీ రెస్టారెంట్ (గ్రౌండ్ ఫ్లోర్)
ఫుల్ భోజనం రూ.65/- మాత్రమే
పార్సిల్ భోజనం రూ. 100/- మాత్రమే

ప్రత్యేకమైన వంటశాలలో అనుభవం గల కుక్స్‌తో కాఫీ, టిఫిన్, ఐస్‌క్రీమ్ మరియు
రుచికరమైన సాంప్రదాయ శాఖాహార భోజనం అందుబాటు ధరలకే
సెంట్రలైజ్డ్ ఏసి మల్టీ క్యుసైన్ ఫ్యామిలీ రెస్టారెంట్(ఫస్ట్ ఫ్లోర్)

అనుభవంగల కుక్స్‌తో రుచికరమైన చైనీస్, తందూరి, ఇండియన్, నార్త్ ఇండియన్,
ఫ్రైడ్‌రైస్ మరియు చికెన్ & మటన్ బిర్యాని అందుబాటు ధరలకే.
పార్సిల్ సౌకర్యం కలదు
హోటల్ సుప్రభాత్ పొగతోట, నెల్లూరు. ఫోన్: 0861-2345045, 2345046. E-mail : hotelsuprabhat@gmail.com

PDF Compressor Free Version



## కదంబం

### దిగంతరేఖలమీద

శిఖా-ఆకాష్,
సెల్: 92939 01571.

స్వప్నాలు గాయపడిన రాత్రి
మృత్యుధూళిగా వికసిస్తోన్న సూర్యోదయం
హృదయం నిండా చీకటి బీభత్సాలే
నెత్తురోడుతున్న ఆకలి సముద్రాలే
మనిషి పాదాల కింద కదలాడ్తున్న విధ్వంస నేత్రాలు
శిలువెక్కిన ప్రకృతి తత్త్వాలు
మారుతున్న చలనసూత్రాలు
మట్టి పొరలు కింద పవిత్ర యుద్ధాలు
స్లీపింగ్ బుద్ధ సాక్ష్యాలు
అధివాస్తవికా ఆర్తనాదాల విజృంభణ
ఎప్పటికీ తెరచుకోని మోక్షద్వారాల ఆకర్షణ
నేనొక ఉత్పరివర్తనాల శూన్యవరణం
ఆవలి తీరాన అనేకానేక ముఖాల గుహల్లోంచి
గ్లిజరిన్ మేఘాలు కమ్ముకున్న
గగనారణ్య సౌందర్యాలనీ దేహంలో కంటున్నా
స్పృహతప్పిన గడియారాల మహాస్వరాలు
అల్లుకున్న దేశాన్ని వింటున్నా
వెన్నెముక లేని మాతృభూమి ఆత్మహత్య
ఊహకందని అనైతికాల ఘోష ఈ మృతభాష
క్రీతం తర్వాత అవినీతి లోకాల సామాజిక హత్య
అనేక అపశబ్దాల కింద పడి అంతరించిన శతాబ్దం
ప్రజ్వరిల్లుతోన్న బానిస స్వర్గం
కాంతివత్సరాల మంత్రదర్పణంలో
మతగ్రంథాల గంజాయి మొక్కల రాజకీయ దైవత్వం
వింటున్నానీ నేల మాళిగల్లో
మిలియన్ డాలర్ల వారసత్వ దేవుళ్ళ వామన రాజ్యంలో
ఆకలి చచ్చిన పీనుగులను మోస్తున్నా
అంతా అంతా ఆర్థిక ఆకాంక్షల సంక్షోభాకాశం
గ్రహాంతర విగ్రహాల అనంతర
సంభాషణా వ్యామోహం
ఏ దోవల్లేని నీలిగాలి మాయా వలయాల్లోకి
లోతందని సుఖలాలస మిథ్యల్లోకి నేడులేని రేపటిలోకి
చరిత్రలేని చరిత్రప్పని తీరాల్దాటి

## 24 నుంచి వేసవి సంగీత, నృత్య శిక్షణ శిబిరం

నెల్లూరు ఆర్టీసీ బస్టాండు ప్రక్కనగల ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలలో ఈనెల 24వతేదీ నుంచి మే నెల 31వతేదీ వరకు వేసవి సంగీత, నృత్య శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ సీ.మునికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా శిబిరంలో వయోపరిమితి భేదంలేదని ఎవరైనా వచ్చి నేర్చుకోవచ్చన్నారు. ప్రతిరోజు ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు, సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 7గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల లోపు సంప్రదించాలని, ఇతర వివరాలకు 99893 20093,92913 72724 సెల్ నెంబర్లలో సంప్రదించాలనికోరారు.

## బ్రాహ్మణ వధూవరుల పరిచయవేదిక

నెల్లూరు దర్గామిట్టలోని కస్తూరిభా కళాక్షేత్రంలో ఈ నెల 21న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ సేవాసంఘం ఉచితంగా బ్రాహ్మణ వధూవరుల పరిచయవేదిక ఏర్పాటు చేసినట్లు సంఘం అధ్యక్షుడు వి.చంద్రమౌళి, వేదిక కన్వీనర్లు జి.వి.శివనారాయణ, యమ్.కామేశ్వరప్రసాద్‌లు సంయుక్త ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9849049349, 9441895595, 99850 25173 నెంబర్లలో సంప్రదించమని తెలిపారు.

## గల్పిక

# ఆనం వ్యాఖ్యల వెనుక దిష్టిబొమ్మల వ్యాపారులు

*భేతాళకథ*

పట్టువదిలే హైటెక్ విక్రమార్కుడు తాను బసచేసిన హోటల్ మెట్లు దిగుతూ మురళీకృష్ణ హోటల్‌కు వచ్చాడు. లైట్‌గా నాలుగు ఇడ్లీ, రెండు వడ, నాలుగు పూరి, ఒక మసాలాదోశ, ఒక ఉప్మా పెసరట్టుతో టిఫిన్ లాగించాడు. అనంతరం అక్కడే ఆటో ఎక్కి ఒకే ఒక నిముషంలో పెద్దాసుపత్రి వద్ద దిగి లోపలకు వెళ్లాడు. మార్చురీలో వున్న ఓ శవాన్ని భుజాన వేసుకుని బోడిగాడితోటలోని రోటరీక్లబ్ శ్మశానవాటిక వైపు నడవసాగాడు. నడినెత్తిమీద కొచ్చిన ఎండతో విక్రమార్కుడి ఒళ్లంతా చెమటతో తడిసిపోయింది. టీటీడీ కళ్యాణ మండపం వద్ద కొచ్చేసరికి ఎండదెబ్బకు విక్రమార్కుడికి కళ్లు తిరగసాగాయి. దీంతో ఆందోళనపడిన విక్రమార్కుడు... భుజానవున్న బాడీని తడుతూ... భేతాళ... భేతాళ అని అరిచాడు. అప్పుడు బాడీలోని భేతాళుడు మూలుగుతూ... వాట్ విక్రమార్కా... మంచి నిద్రలో వుంటే డిస్ట్రబ్‌చేస్తావెందుకు అని అడిగాడు. ఈ ఎండలో నడిచేసరికి నాకు కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. స్పృహతప్పి పడిపోయేటట్లున్నాను... నాకు ఏమైందంటావ్ అని విక్రమార్కుడు అడిగాడు. దానికి భేతాళుడు... నీకు షుగర్, బి.పి. వున్నాయా? అని అడిగాడు. నేనెప్పుడూ వాటిని కొనలేదని విక్రమార్కుడు చెప్పాడు. అవి కొంటే వచ్చేవికాదు, అతిగా తింటే వచ్చేరోగాలు... అవి వుంటేనే ఇలా కళ్లు తిరుగుతుంటాయి. ఎందుకైనా మంచిది, రేపు ఒకసారి బొల్లినేని ఆసుపత్రికెళ్లి టెస్ట్ చేయించుకో... పోతే ఈ ఎండలో బోడిగాడితోట దాకా ఎక్కడపోతావుగాని, అలా ఏ.సి.బార్‌లో కూర్చుందాం పద, నీకొక స్టోరీ చెబుతానన్నాడు. దానికి విక్రమార్కుడు ఆశ్చర్యంగా... అప్పుడే బార్లు తెరచివుంటారా? అని ప్రశ్నించాడు. ఈ రాష్ట్రంలో ఆసుపత్రులు, అంబులెన్స్‌లు, మెడికల్‌షాపులు, పాలబూత్‌లు, ప్రభుత్వ ఆఫీసులు వంటివి 24గంటలూ పనిచేయవు. అలాగే 24గంటలూ మంచినీళ్లు దొరకవు. కాని 365రోజులు 12నెలలు 52వారాలు, 24గంటలూ ఏదైనా దొరికేది వుందంటే అది మద్యమే! మందుబాబుల సౌకర్యార్థం బార్లను 24గంటలూ తెరిచే విధంగా చేసిందీ ప్రభుత్వం. పోదాంపద అని తోడ్కొని పోయాడు. బార్ వద్ద ఓ ఇద్దరు తాగుబోతులను అక్కడి సర్వర్‌లు భుజాలమీద వేసుకుని బయటకు తీసుకొచ్చి ఆటోనెక్కిస్తున్నారు. విక్రమార్కుడు వారిని చూసి... అదేంటి భేతాళ... ఇంత పొద్దున్నే వీళ్లు ఇంతగా తాగారా అని అడిగాడు. దానికి భేతాళుడు... వాళ్లు ఇంత పొద్దున తాగలేదు... నిన్న పొద్దున నుండి తాగుతున్నారు. లోపల మొన్న పొద్దున్నుండి తాగుతున్న వాళ్లు కూడా వున్నారు పదా అంటూ లోపలకు తీసుకెళ్లాడు. చెరొక బీర్ ఆర్డర్ వేసుకున్నాక భేతాళుడు స్టోరీ చెప్పడం మొదలుపెట్టాడు.

దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి వున్న రోజులు... నెల్లూరు జిల్లాలో స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకానందరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డిలు తొలుత నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి అనుచరులుగా వుండేవాళ్లు. రాజకీయాలలో నాయకులు నీడనే నమ్మరు. 1999 ఎన్నికలలో తన అనుచరులుగా వున్నప్పటికి ఆనం సోదరులను నేదురుమల్లి నమ్మలేదు. నెల్లూరు అసెంబ్లీ టిక్కెట్ వివేకాకు రాకుండా చేయడానికి విశ్వ ప్రయత్నాలు చేసాడు. వీళ్లిద్దరు ఎమ్మెల్యేలైతే తనను లెక్కకూడా చేయరని ఆయన భయం. ఆ తర్వాత ఆయన భయపడ్డట్లే జరిగింది. పీసీసీ అధ్యక్షుడిగా వున్న వై.యస్. అండతో వివేకా నెల్లూరు సీటు తెచ్చుకోవడం, గెలవడం జరిగింది. అప్పటినుండి నెల్లూరుజిల్లాలో ఆనం సోదరులు వై.యస్. వర్గీయులుగా ముద్రపడిపోయారు. వై.యస్. అండతోనే 2004లోనూ 2009లోనూ సోదరులిద్దరూ సీట్లు తెచ్చుకున్నారు. జిల్లాలో నేదురుమల్లి వర్గాన్ని పూర్తిగా దెబ్బతీయడానికి వై.యస్., ఆనం సోదరులకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించాడు. 2004లో కేంద్ర కేబినెట్‌లో నేదురుమల్లి జనార్ధనరెడ్డికి మంత్రి పదవి రాకుండా చేయడం కోసం ఈ జిల్లా నుండి రాష్ట్ర కేబినెట్‌లో రాజ్యలక్ష్మికి స్థానం కల్పించారు. దానిమూలంగా రామనారాయణరెడ్డికి మంత్రి పదవి లేకుండాపోయింది. అయితే మూడేళ్ల తిరక్కముందే ఆనంకు వై.యస్. తన కేబినెట్‌లో చోటు కల్పించాడు. జిల్లాలో కాంగ్రెస్‌పార్టీపై ఆనం సోదరులకు పూర్తిపెత్తనం కల్పించాడు. 2009లో అభ్యర్థుల ఎంపికలోనూ వీరిమాటకు ప్రాధాన్యతనిచ్చాడు. వరుసగా ఆనంకు రెండోసారి మంత్రివర్గంలో స్థానం కల్పించాడు. నెల్లూరు జిల్లాలో ఆనం సోదరులంటే వై.యస్. బ్రాండ్ బలంగా పడిపోయింది. 2009సెప్టెంబర్ 2వ తేదీ వై.యస్. హెలికాఫ్టర్ ప్రమాదంలో మరణించాడు. ఆ తర్వాత కొన్నిరోజులు జగన్‌కు మద్దతుగా మాట్లాడారు. కాని ఢిల్లీ అధిష్టానం జగన్‌కు వ్యతిరేకంగా వుందని పసిగట్టి తమ వాయిస్ మార్చారు. జగన్‌కు వ్యతిరేకంగా మాట్లాడసాగారు. జగన్‌పై ఘాటుగా విమర్శలు చేయసాగారు. అలాగే విజయమ్మ మీద కూడా విమర్శలు చేసారు. మొన్నటివరకు వై.యస్.పై విమర్శలు చేయలేదు. కాని నిన్నటికి నిన్న ఆనం రామనారాయణరెడ్డి విలేకరుల సమావేశం పెట్టి తమను ఎంతగానో ఆదరించిన వై.యస్.పై వ్యక్తిగత విమర్శలు చేసారు. ఆయన కుటుంబాన్ని తూలనాడాడు. ఇది నమ్మక ద్రోహం కాదా? బ్రతికుండగా వై.యస్.ను దేవుడంటూ పొగిడిన ఆనం రామనారాయణరెడ్డి ఇప్పుడాయనను అవినీతిపరుడంటూ విమర్శించడం సమంజసమేనా? అసలు ఆయన ఈ సమయంలో ఎందుకు ఈ విధంగా మాట్లాడాల్సి వచ్చింది? ఈ ప్రశ్నలకు సమాధానం తెలిసి కూడా చెప్పకపోయావో తెలంగాణ కాంగ్రెస్ నాయకుల మాదిరిగా ఫ్యూచర్‌పిక్చర్ అర్థం కాక ఎర్రగడ్డ పిచ్చాసుపత్రిలో చేరుతావని హెచ్చరించాడు.

అప్పుడు విక్రమార్కుడు... రామనారాయణరెడ్డి మానవతాదృక్పథంతోనే వై.యస్.పై ఘాటుగా విమర్శలు చేసాడు అని చెప్పాడు. ఆ మాటకు భేతాళుడు తల వెయ్యినూటపదహారు కిలోమీటర్ల స్పీడుతో తిరిగింది. ఇంత ఘాటు విమర్శల వెనుక మానవత్వముందా... అదెలా అని భేతాళుడు ప్రశ్నించాడు. వెంటనే విక్రమార్కుడు తన ఐపాడ్‌తీసి ఒక దిష్టిబొమ్మ డాట్ కాం అనే వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసాడు. దానిలో దృశ్యాలు రాసాగాయి.

అది నెల్లూరు, సంతపేటలో ఆనం రామనారాయణరెడ్డి ఇల్లు. మంత్రి అప్పుడే టిఫిన్ తిని క్రిందకొచ్చాడు. కొంతమంది వ్యక్తులు ఆయన వద్దకొచ్చి... అయ్యా మీరే మమ్మల్ని ఆదుకోవాలయ్యా అని వేడుకున్నారు. మీరంతా ఎవరని మంత్రి ప్రశ్నించాడు. దానికి వాళ్లు... మేము దిష్టిబొమ్మల వ్యాపారులం. ఇటీవలే యూనియన్ కూడా పెట్టాం. అన్ని రాజకీయపార్టీలవాళ్లకు ఏ నాయకుడి దిష్టిబొమ్మ కావాలన్నా నిముషాలలో తయారుచేయించి ఇస్తాం. అయితే సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి మూలంగా మా వ్యాపారాలు దెబ్బతిన్నాయి. ఎప్పుడన్నా ఒక సమస్య వస్తే ప్రతిపక్షాలు దిష్టిబొమ్మలు తగలేసేవి. కాని ఇప్పుడు రోజూ సమస్యలే కాబట్టి ప్రతిపక్షాల వాళ్లు దిష్టిబొమ్మలు కొనడం లేదు. మా బ్రతుకులు రోడ్డున పడేటట్లున్నాయి. మీరే మమ్మల్ని కాపాడాలని అడిగారు.

వారి దీనగాథ వినేసరికి ఆనంకు కళ్లలో నీళ్లు గిర్రున తిరిగాయి. వెంటనే వారితో... మీకొచ్చిన ఇబ్బందేమీ లేదు... ఈరోజే ప్రెస్‌మీట్ పెట్టి నేనొక స్టేట్‌మెంట్ ఇస్తాను... ఆ దెబ్బతో మీ వ్యాపారాలు పుంజుకుంటాయి. ముందుగా నావి, జగన్‌వి దిష్టి బొమ్మలు తయారుచేసి స్టాక్ పెట్టుకోండి అని చెప్పి, వారిని పంపించాడు. ఆ తర్వాత ఆయన విలేకరుల సమావేశంపెట్టి వై.యస్. కుటుంబం పై తీవ్ర విమర్శలు చేసాడు. దీంతో రాష్ట్రమంతా వైకాపా కార్యకర్తలు ఆనం రామనారాయణరెడ్డి దిష్టిబొమ్మలు తగలేయగా, ప్రతిగా కాంగ్రెస్ వాళ్లు జగన్ దిష్టిబొమ్మలను తగలబెట్టారు. ఏదైతేనేం ఆనం వ్యాఖ్యలు దిష్టిబొమ్మల వ్యాపారులకు వరంగా మారాయి. వాళ్లంతా కూడా ఆనంకు కృతజ్ఞతలు చెప్పుకోసాగారు. ఇక్కడితో ఐపాడ్‌లో దృశ్యాలు ముగిసాయి. అప్పుడు విక్రమార్కుడు... భేతాళా! సీన్ అర్థమైందా అని అడిగాడు. అర్థమైంది... అదుగో బేరర్ వస్తున్నాడు బిల్లు నువ్వే కట్టు అంటూ భేతాళుడు బాడీని అక్కడే వదిలేసి తుర్రుమన్నాడు.

★★★★★

## 20న కవికోకిల జయంతి

నెల్లూరు పురమందిరంలో ఈనెల 20న కవికోకిల దువ్వూరు రామిరెడ్డి 117వ జయంతి సభ జరుగుతుంది. సభలో రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ అడిషనల్ డైరెక్టర్, సాహితీవేత్త వాడ్రేవు చినవీరభద్రుడు "కవికోకిల" కవితా వైభవంపై ఉపన్యసిస్తారని, సుప్రసిద్ధ న్యాయవాదులు పీవి రమణారెడ్డి అధ్యక్షత వహిస్తారని దువ్వూరు రామిరెడ్డి విజ్ఞాన సమితి అధ్యక్షులు పి.వి.రమణారెడ్డి కార్యదర్శి బి.వి.నరసింహం, కోశాధికారి జె.వి.రెడ్డి సంయుక్త ప్రకటనలో తెలిపారు. తొలుత సంగీత విద్వాంసులు జె. బాలార్క శిష్యబృందం భక్తి గీతాలాపన చేస్తుందని తెలిపారు.

## అఖిల భారత అభ్యుదయ వేదిక నూతన కమిటీ

నెల్లూరు ఐఎంఏ సమావేశ మందిరంలో ఈనెల 14న అఖిల భారత అభ్యుదయ వేదిక రెండో జిల్లా మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా డాక్టర్ మధుసూదనశాస్త్రి, ప్రధాన కార్యదర్శిగా న్యాయవాది అరిగెల నాగేంద్రసాయి, ఉపాధ్యక్షులుగా తన్నీరు కోటయ్య, గూడూరు సుబ్బారెడ్డి, సహాయ కార్యదర్శిగా కె.దయాశంకర్, డాక్టర్ పి.చంద్రశేఖర్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న అఖిల భారత అభ్యుదయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి అరవై ఏళ్ళు నిండినా నిరుపేదలు, కష్టజీవుల పరిస్థితిలో మార్పు లేదని, దానికి కారణం మన పాలకుల తీరేనన్నారు. అధికార యంత్రాంగం స్వేచ్ఛగా పనిచేస్తే అవినీతికి తావుండదన్నారు. ప్రతి ఒక్కరూ ఓటును హేతుబద్ధంగా వినియోగించుకోవాలని, మేధావుల వైఖరిలో మార్పురావాలని పేర్కొన్నారు. సభలో వేదిక ప్రధాన కార్యదర్శి నాగేంద్రసాయి గునపాటి ప్రసాద్‌రెడ్డిలు మాట్లాడగా డాక్టర్ మధుసూదనశాస్త్రి అధ్యక్షత వహించారు. దయాశంకర్ హైదరాబాద్ బాంబుపేలుళ్ళలో మరణించిన అభాగ్యులకు సంబంధించి సంతాపసభ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

### మేషం

అశ్వని, భరణి, కృతిక 1 పాదము

అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. కుటుంబసౌఖ్యం, షేర్లు పెట్టుబడుల మీద లాభాలుంటాయి. శుభకార్యాలు, ఆధ్యాత్మిక కార్యాలలో పాల్గొంటారు. వ్యాపార నిర్వహణలో కొద్ది అవరోధాలుంటాయి. ఆశించిన ఆదాయం ఉండకపోవచ్చును. కాని ఆర్థిక వ్యవహారాల నిర్వహణలోగాని, చేపట్టిన పనులందుగాని సమర్థత లోపం ఉండదు.

### వృషభం

కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఉద్యోగులకు, అధికారులకు అదనపు బాధ్యలుండినా సహకారం బాగుంటుంది. కండరాలు, నరాలు సంబంధమగు బాధలుంటాయి. ఇతర వ్యాపకాలు పెరిగి, తీరిక లేకుండా శ్రమపడతారు. వృత్తిపరంగా అవకాశాలు ఆదాయం బాగుంటుంది. వ్యాపారవర్గాల వారికి శ్రమకు తగ్గ ఫలితం ఉంటుంది. ఆదాయం సామాన్యం. శుభ కార్యాలు, దైవకార్యాలలో పాల్గొంటారు.

### మిథునం

మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఉద్యోగులు సమర్థతతో పనులుచేసి అధికారులతో సన్నిహితం కాగలరు. దైవ, ఆధ్యాత్మిక, సేవాకార్యాలలో ప్రముఖంగా ఉంటారు. వృత్తిపరంగా ప్రముఖులతో పరిచయాలు, పబ్లిక్‌తో పరిచయాలు, రాజకీయ పలుకుబడి బాగుంటుంది. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు బాగుంటాయి. కుటుంబసభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. బుధ, గురువారాలలో కుటుంబఖర్చులు పెరుగుతాయి.

### కర్కాటకం

పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

అవగాహనలోపం వల్ల బంధుమిత్రులతో చిన్న ఇబ్బందులు కలుగుతాయి. శుభకార్యాలలో పాల్గొనడం, దూరప్రయాణాలు, సత్కార్యాలకు సహాయపడటం జరుగుతుంది. మాటతీరు, తొందర, నియంత్రించుకొంటే మంచిది. ఆర్థికస్థితి బాగుండినా మధ్యలో అదనపు ఖర్చులుంటాయి. వృత్తి వ్యాపారాలలో ఆదాయము బాగుంటుంది. స్వయంకృషితో అనుకున్నది సాధిస్తారు.

### సింహం

మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

చేపట్టిన పనులు ఓర్పుతోనే జరుపుకొనవలసి ఉంటుంది. ఆర్థిక వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు జరిగి ఇబ్బందిపడేస్థితి ఉన్నది. కుటుంబసమేతంగా దూరప్రయాణాలుండగలవు. వృత్తిజీవనంలో విశ్రాంతి లేకపోవడం, రాబడి పెరగడం ఉంటుంది. వ్యాపార వర్గాలకు పోటీ పెరిగి ఆదాయం తగ్గకలదు. చిన్న చిన్న విషయాలపై బంధువర్గం నుండి విమర్శనలుంటాయి.

### కన్య

ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

కుటుంబ సభ్యుల అనుకూలత తక్కువ. అధికారుల నుండి ఉద్యోగ వాణిజ్య వర్గాలకు ఒత్తిడి ఇబ్బందులు కలుగుతాయి. ఆత్మీయులకు అనారోగ్య బాధలు, శుభ కార్యాలలో పాల్గొన్నందున ఖర్చులుంటాయి. అంచనాలకు మించిన ఖర్చుల వలన ఇబ్బందులునెదుర్కొంటారు. వృత్తిపరంగా, వ్యాపారపరంగా కృషికి తగ్గ ఆదాయం ఉండదు. కళాక్రీడారంగాల వారికి కొంత బాగుంటుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 19.4.2013 నుండి
తేది. 25.4.2013 వరకు

ఈ వారము మీనంలో బుధుడు. మేషంలో రవి కుజశుక్ర కేతువులు. వృషభంలో గురువు. కర్కాటక సింహాకన్య తులా రాశులలో చంద్రుడు. తులలో రాహుశనులు సంచరిస్తారు.

### పంచాంగము :

తేది 19 శుక్రవారము శ్రీరామనవమి.

తేది 25 గురువారము రాత్రి 1.22 గంటల నుండి 1.55లోగా చంద్రగ్రహణము.

### చైత్రమాస శుక్ల పక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 19 | శుక్ర | నవమి | రా॥ గం.4.31వ॥ |
| తేది. 20 | శని | దశమి | రా॥ గం.5.23వ॥ |
| తేది. 21 | ఆది | ఏకాదశి | పూర్తిగా |
| తేది. 22 | సోమ | ద్వాదశి | పూర్తిగా |
| తేది. 23 | మంగళ | త్రయోదశి | రా॥ గం. 4.43వ॥ |
| తేది. 24 | బుధ | చతుర్దశి | రా॥ గం. 3.32వ॥ |
| తేది. 25 | గురు | పూర్ణిమ | రా॥ గం. 3.15వ॥ |

### తుల

చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

అనుకున్న పనులు నిదానంగా జరగడం, బంధువర్గంలో అనారోగ్య వార్తలు వినడం, పెట్టుబడులపై ఆదాయం తగ్గడం జరుగుతుంది. ఉద్యోగులకు స్థాన మార్పులు, పనిభారం పెరుగుతుంది. పరిశ్రమలు, వ్యాపారవర్గాల వారికి ఆర్థిక ఇబ్బందులుంటాయి. స్థిరాస్తి వ్యవహారాలు, ఋణాల వల్ల పేచీలుంటాయి. సొంత వృత్తులు నిర్వహించే వారికి కొద్ది మేలుగా ఉంటుంది.

### వృశ్చికం

విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

కుటుంబంలో మీకు అనుకూలత తక్కువగా ఉంటుంది. ఉద్యోగ వర్గాలకు స్థానచలనము, అదనపు బాధ్యతలుంటాయి. స్థిరాస్తుల కొనుగోలు జరుపమని ప్రోత్సాహం ఉంటుంది. భాగస్వామ్య అవకాశాలు వ్యాపార, పరిశ్రమలందు దొరక వచ్చును. వృత్తి వ్యాపారాలలో స్వల్పంగా ఆదాయం పెరుగుతుంది. చేపట్టిన పనులకు ఆటంకాలు రావడం వల్ల టెన్షన్ పడుతుంటారు.

### ధనుస్సు

మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వృత్తి, పరిశ్రమల వారికి ప్రోత్సాహకాలు,ఋణాలు అందుతాయి. ఉద్యోగులకు పదవీవృద్ధి, స్థానమార్పులు, అదనపు బాధ్యతలుంటాయి. గృహమార్పులు, వస్తు వాహన గృహ రిపేర్లుంటాయి. ఆత్మీయులకు, మీకు ఆరోగ్య లోపం వల్ల బాధలుంటాయి. వ్యాపారులకు దీర్ఘ కాల ప్రయోజనాలు పొందే అవకాశం, కొద్దిపాటిగా ఆదాయవృద్ధి ఉంటుంది.

### మకరం

ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

పెట్టుబడులు, స్థిరాస్తులపై ఆదాయం పెరుగుతుంది. ఆత్మీయులకు కొద్ది అనారోగ్య బాధలుంటాయి. వ్యాపారాలలో, వృత్తులలో నిలద్రొక్కుకొని, ఆదాయం పెంచుతారు. కుటుంబంలో చిన్న చిన్న విభేదాలు కలిగి సర్దుబాటు కాగలవు. స్థిరాస్తులు, ఎక్కువ విలువగల వస్తువుల లావాదేవీలందు తొందరపాటు వద్దు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడవచ్చును.

### కుంభం

ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ప్రభుత్వము వలన అనుమతులు, బ్యాంకు ఋణాలు లభిస్తాయి. వృత్తి జీవనంలో తీరిక ఉండదు. ఉద్యోగులకు పనిభారం, బాధ్యతలు పెరుగుతాయి. ఆస్తి వ్యవహారాలు, భాగాలు పంపిణీ విషయాలలో మన స్పర్థలు ఏర్పడే అవకాశమున్నది. స్టాక్ రంగంలో నిరాశ ఫలితాలుంటాయి. స్త్రీలకు అనారోగ్య బాధలుంటాయి. గృహ, వస్తు వాహన రిపేర్లు ఉండవచ్చును.

### మీనం

పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

సాంకేతిక వైజ్ఞానిక కళారంగాలలో గౌరవము, అవకాశాలుంటాయి. గృహరిపేర్లు వాహన రిపేర్లుంటాయి. పరిశ్రమలు, వ్యాపారాలలో నిలద్రొక్కుకుంటారు. ముఖ్యమైన వ్యవహారాలు పనులు సక్రమంగా జరిగిపోగలవు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. ఖర్చులు కూడా అదనంగా ఉంటాయి. శుభకార్యాలలో పాల్గొంటారు.

## ఆచారాలు-శాస్త్రీయత అంశంపై సదస్సు

ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులోని ఒక హోటల్‌లో ఆచారాలు-శాస్త్రీయత అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయినవోలు శ్రీనివాసాచార్యులు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కష్టంలో ఉన్న వారిని ఆదుకొనేందుకు మానవత్వం చూపడమే అన్నిటికన్న గొప్ప అన్నారు. సాటివ్యక్తిపై ప్రేమ, కరుణ చూపకుండా ఎన్ని పూజలు చేసినా దేవుడు కరుణించడన్నారు. చిత్తశుద్ధితో త్రికరణశుద్ధిగా ప్రార్థనచేస్తే మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసాచార్యులను ఆర్యవైశ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి నూకల శేషయ్య గుప్తా, కొండా ప్రేమశంకర్, బివి నరసింహం తదితరులు పాల్గొన్నారు.

## సాయిసదన్‌లో శ్రీరామనవమి ఉత్సవాలు

నెల్లూరు చిల్డ్రన్స్ పార్క్ సమీపంలో గల సాయిసదన్ షిరిడీ సాయిబాబా మందిరంలో ఈనెల 18వతేదీ నుండి 20వతేదీ వరకు శ్రీరామనవమి మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు షిరిడిసాయి సేవా సమాజ్‌ట్రస్ట్ నిర్వాహకుడు శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం శిరిడీ హారతులు, అఖండ శ్రీసాయినామ సంకీర్తనలు, పల్లకి ఉత్సవం జరుగుతుందన్నారు. శ్రీరామనవమి సందర్భంగా సీతారామ చంద్రుల వారికి సహస్రనామపూజ, సాయంత్రం గంధమహోత్సవం, పుష్పరథోత్సవం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## కవిత్వ నిర్మాణానికి పనిముట్లు అవసరం



మెట్టు రామచంద్రప్రసాద్‌ను సన్మానిస్తున్న సాహితీమిత్రులు

పింగళి లక్ష్మీకాంతం రచించిన సాహిత్య శిల్ప సమీక్ష, సమగ్ర ఆంధ్ర సాహిత్య చరిత్ర, నిఘంటువైన శబ్ద రత్నాకరం, పదో తరగతి తెలుగు వాచకంలోని ఛందస్సు, వ్యాకరణాలు ప్రతి కవి చదివి తీరాలని పద్య కళాపరిషత్ అధ్యక్షులు మెట్ట రామచంద్రప్రసాద్ అన్నారు. ఇవి ప్రతి కవికి కవితా నిర్మాణానికి కావలసిన పనిముట్లు అని పేర్కొన్నారు. నెల్లూరు గాంధీబొమ్మ సాయిబాబా గుడి వద్ద గల నవీన్ డయాబెటిక్ క్లినిక్ సమావేశ మందిరంలో ఈ నెల 14న సాహితీ మిత్రమండలి ఆధ్వర్యంలో మెట్టు రామచంద్రప్రసాద్‌కి ఉగాది పురస్కార సత్కారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "రమణీయార్థ ప్రతిపాదక శబ్దఃకావ్యం" అన్న కవిత్వ నిర్వచనాన్ని పేర్కొన్నారు. తదుపరి కవులు కె.గోపాలరావు, పట్టెం వేణుగోపాల్, లలిత, తదితరులు కవితా పఠనం చేసారు.

కార్యక్రమంలో సాహితీ మిత్రమండలి అధ్యక్షులు చిన్ని నారాయణరావు, సభ్యులు డాక్టర్ ఈదూరు సుధాకర్, ఈతకోట సుబ్బారావు, ఏటూరు నాగేంద్రరావు, వంజవాక సతీష్‌రెడ్డి, సహస్ర సభా సింహం బి.వి.నరసింహం, ఆలూరు శిరోమణిశర్మ, బాలకృష్ణ మూర్తి, మురళీ ఆర్ట్స్ మురళి, గుర్రాల రమణయ్య తదితర సాహితీ ప్రియులు పాల్గొన్నారు.


## పెళ్లి సంబంధాలు

### వధువు కావలెను

1. 1985 మార్చి 17 జననం. ఎత్తు 5'7". చదువు బి.కాం., వృత్తి వ్యాపారం. హోటల్స్(యం.డి) బెంగుళూరు. ఉన్నతమైన రెడ్డి వ్యాపార కుటుంబం, ఆస్థి విలువ 30కోట్లు భాగం. స్వస్థలం బెంగుళూరు. తల్లి స్వస్థలం నెల్లూరుజిల్లా.
2. 1986 జూన్ 3 జననం. ఎత్తు 6'1". చదువు బి.టెక్(కంప్యూటర్స్). ఉద్యోగం వెల్స్‌ఫార్గో(హైదరాబాద్). జీతం నెలకు రూ.50,000/-. ఆస్థి విలువ 2కోట్లు. ఉన్నతమైన రెడ్డి ఉద్యోగ కుటుంబం. స్వస్థలం గుంటూరుజిల్లా. ప్రస్తుత నివాసం హైదరాబాద్.
3. 1983 జనవరి 11 జననం. ఎత్తు 5'10". చదువు బి.టెక్.(ఆర్ట్) యం.యస్(ఆస్ట్రేలియా). ఉద్యోగం ప్రాజెక్ట్‌మేనేజర్(ప్లానింగ్ & ఎక్సిక్యూషన్) కంపెని చోళా కంపెని మేనేజమెంట్ ప్రై. లిమిటెడ్, చెన్నై. ఆస్థివిలువ 5కోట్లు. ఉన్నతమైన రెడ్డి ఉద్యోగ కుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా.
4. 1982 మార్చి 13జననం. ఎత్తు 5'11". చదువు బి.టెక్. యం.బి.ఏ. ఉద్యోగం వ్యాపారం. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పార్టనర్. సాఫ్ట్‌వేర్ కన్సల్టెన్సీ & ట్రెయినింగ్ సెంటర్. ఉన్నతమైన రెడ్డి ఉద్యోగ కుటుంబం. ఆస్థి విలువ 6కోట్లు. స్వస్థలం కడపజిల్లా. ప్రస్తుతం బెంగుళూరు.
5. 1984 అక్టోబరు 25జననం. ఎత్తు 5'8". చదువు బి.కాం(బెంగుళూరు) యం.బి.ఏ(ఆస్ట్రేలియా). వాణిజ్యం బెంగుళూరు. ఆస్థివాటా 40కోట్లు. ఉన్నతమైన రెడ్డి వ్యాపార కుటుంబం. స్వస్థలం కర్నూలుజిల్లా.

### వరుడు కావలెను

6. 1988 ఫిబ్రవరి 27 జననం. ఎత్తు 5'2". చదువు బి.టెక్(ఎలెక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్). ఉద్యోగం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. కంపెని శాప్ లాబ్స్ ఇండియా ప్రై. లిమిటెడ్, బెంగుళూరు. జీతం నెలకు రూ.65,000/-. ఉన్నతమైన రెడ్డి ఉద్యోగకుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా. ఆస్థివిలువ 50లక్షలు.
7. 1988 జూన్ 28 జననం. ఎత్తు 5'7". చదువు బిటెక్(మెకానికల్). ఉద్యోగం టిసియస్(చెన్నై). ఉన్నతమైన రెడ్డి ఉద్యోగ కుటుంబం. స్వస్థలం కడపజిల్లా. ఆస్థివాటా 1కోటి.
8. 1981 ఆగష్టు 7 జననం. ఎత్తు 5'4". చదువు బి.యస్.సి(కంప్యూటర్స్), యం.బి.ఏ(హెచ్.ఆర్). ఉన్నతమైన రెడ్డి ఉద్యోగ కుటుంబం. ఆస్థివాటా 2 1/2 కోట్లు. స్వస్థలం నెల్లూరుజిల్లా.
9. 1988 జూలై 25 జననం. ఎత్తు 5'7". చదువు బి.టెక్(ఐటి) (యం.టెక్) కంప్యూటర్స్. ఉన్నతమైన రెడ్డి ఉద్యోగకుటుంబం. ఆస్థి విలువ 2కోట్లు. స్వస్థలం నెల్లూరుజిల్లా.
10. 1987 మే నెల 8జననం. ఎత్తు 5'2". చదువు లా 2వ సంవత్సరం మరియు యం.బి.ఎ యూనివర్శిటి ఆఫ్ జార్జియానా (అమెరికా). ఉన్నతమైన రెడ్డి డాక్టర్ల కుటుంబం. ప్రస్తుత నివాసం కెనడా. ఆస్థివాటా 10కోట్లు. ప్రస్తుత అడ్రస్సు హైదరాబాద్.

వివరాలకు: కొండూరు హరినారాయణరెడ్డి, 25-9-413, పోస్టల్‌కాలనీ, ఆంధ్రకేసరినగర్, నెల్లూరు - 4.
98480 34522
94406 39460.
ఫోన్‌బాక్స్ నెం.4, C/o. లాయర్ జాతీయ తెలుగు వారపత్రిక, ప్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు, మాగుంట లే-అవుట్, నెల్లూరు - 3.

PDF Compressor Free Version



# గూడూరు డివిజన్ వార్తలు

## ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



బహుమతినందజేస్తున్న సబ్‌కలెక్టర్ నివాస్, ప్రక్కన పనబాక కృష్ణయ్య, పాశం సునీల్‌కుమార్

గూడూరు పట్టణంలోని అశోక్‌నగర్ సెంటర్‌లో ఆదివారం అంబేద్కర్ 123వ జయంతి వేడుకలను వేగూరు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గూడూరు సబ్‌కలెక్టర్ జె.నివాస్, కాంగ్రెస్‌పార్టీ గూడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పనబాక కృష్ణయ్య, మాజీమున్సిపల్ ఛైర్మెన్ పాశం సునీల్‌కుమార్ పాల్గొని బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మనపాటి రవీంద్రబాబు, ఉడతా శరత్‌యాదవ్, మోపాటి రామ రాఘవరెడ్డి(బాబురెడ్డి), ఎల్లా శ్రీనివాసులురెడ్డి, సిపిఎం నాయకులు కటికాల వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు ఎం.రాజేష్‌కుమార్, సిహెచ్ ప్రభాకర్, మునిగిరీష్, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదవతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు డిక్షనరీలను, పేద మహిళలకు చీరలు, కంటిఅద్దాలు పంపిణీ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

### అంబేద్కర్‌భవన్‌లో..

అంబేద్కర్ జయంతి వేడుకలను ఆదివారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. గూడూరు పట్టణంలో ముందుగా స్థానిక ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు అంబేద్కర్ భవన్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాలను ప్రతిఒక్కరు తప్పక ఆచరించి ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. అంటరానితనం నిర్మూలన కోసం అంబేద్కర్ ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెండోపట్టణ సమస్యలు పరిష్కరించాలి

### సిపిఐ నాయకుల డిమాండ్




ప్రదర్శన నిర్వహిస్తున్న సిపిఐ గూడూరు ఏరియా సమితి

గూడూరు రెండోపట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ప్రజలు ఎర్రజెండాలను చేతపట్టి పార్టీ కార్యాలయం నుండి ప్రదర్శనగా బయలుదేరి గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద బైఠాయించి ధర్నా నిర్వహించారు. గూడూరు ఒకటవ పట్టణం అంతగా రెండో పట్టణం కూడా విస్తరించి వున్నా ఇక్కడి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు, రాజకీయ నాయకులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని సిపిఐ డివిజన్ కార్యదర్శి ఎం.రాజేష్‌కుమార్ ధ్వజమెత్తారు. గూడూరు సబ్‌కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న డ్రైనేజీ కాలువకు కాంక్రీట్‌తో నిర్మాణపనులు చేయాల్సి వుండగా కాస్మోపాలిటిన్ క్లబ్ నుండి పనులు ప్రారంభించి వాటర్‌ట్యాంకు వరకు వేసిన లైలా తుఫాన్ నిధుల పనుల్లో పెద్దఎత్తున అవినీతి జరిగిందని, మిగిలిన కాలువ పనులు జెసిబితో స్కిల్ట్ తీయాల్సి వుందని, కాని అలా చేయకుండా గూడూరు పురపాలకసంఘ పారిశుద్ధ్య కార్మికుల చేత నామమాత్రంగా పనులుచేసి చేతులు దులుపుకోవడంపట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గూడూరులో వున్న రెండు హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీలు తూర్పు గూడూరులోనే ఉన్నాయని, పడమర గూడూరులో ఇందుకు సంబంధించి ఓ ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి ఈ ప్రాంతం వారికి సౌకర్యం కల్పించే విధంగా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ టౌన్ కార్యదర్శి సివిఆర్ కుమార్, రెండో పట్టణ ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌పట్టణ అధ్యక్షుడుగా హరిప్రసాద్‌రెడ్డి



గూడూరు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడుగా మనుబోలు హరిప్రసాద్‌రెడ్డిని ఎన్నిక చేసారని తెలిసింది. ఈ విషయమై హరిప్రసాద్‌రెడ్డిని 'లాయర్' అడగగా తాను పట్టణ అధ్యక్షుడుగా ఎన్నికైనట్లు, గూడూరు పట్టణ అభివృద్ధికి పాటుపడ తానని, గూడూరు కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పనబాక కృష్ణయ్య నాయక త్వంలో పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

## ఫోటోగ్రాఫర్లకు... ఇళ్ల స్థలాలు కేటాయించండి

గూడూరులో ఎంతోకాలంగా నివాసం ఉంటున్న తాము స్వంత ఇళ్లు లేక అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్నామని, తమకు ఇంటిస్థలాలు కేటాయించి ఇందిరమ్మ గృహాలను మంజూరు చేయాలని గూడూరు పట్టణంలోని ఫోటోగ్రాఫర్లు సోమవారం గూడూరు మండల తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. గూడూరు పట్టణంలో దాదాపు 100మందికి పైగా ఫోటోగ్రాఫర్లు ఉన్నారని, తమకు సరైన ఆర్డర్లు లేక తీవ్రంగా నష్టపోతున్నామని, తమకు వెంటనే ఇంటి నివేశనస్థలాలు కేటాయిస్తే ఇందిరమ్మ గృహాలు నిర్మించుకొంటామని ఫోటోగ్రాఫర్లు తహశీల్దార్ మైత్రేయకు విన్నవించుకున్నారు.

## మెగా ఈవెంట్‌ను విజయవంతం చేయండి

గూడూరులో మొట్టమొదటిసారిగా గూడూరు పట్టణ, పరిసర ప్రాంత ప్రజల కోసం హైటెక్ మెగా ఈవెంట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కె.మునిగిరీష్ తెలిపారు. ఈవెంట్‌కు సంబంధించి విశేషాలను 13వ తేదీ స్థానిక అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వెల్లడించారు.

ఈ నెల 22వ తేదీ సోమవారం సాయంత్రం ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఈ హైటెక్ మెగా ఈవెంట్‌ను నిర్వహించనున్నామని, ప్రముఖ గాయని గీతామాధురి తన గాన మాధుర్యంతో ఆహూతులను అలరింపజేస్తారని, ఈ కార్యక్రమానికి యాంకర్‌గా చిత్రలేఖ వ్యవహరించనుందని, గీతా మాధురితో పాటు ప్రముఖ గాయకులు రహమాన్, శ్రీధర్, జీతెలుగు 'ఆట' విన్నర్ బిట్టు, భువన ఈ కార్యక్రమంలో పాలు పంచుకోనున్నట్టు వారు తెలిపారు. గూడూరులో మొట్టమొదటిసారిగా తెలుగు నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో రమేష్, కృష్ణ శ్రీను పాల్గొన్నారు.

## యామి ఆశలు



అల్లు శిరీష్ తొలి సినిమా 'గౌరవం'పై హీరో కంటే కూడా ఆ చిత్ర హీరోయిన్ యామి గౌతమ్ బాగా ఆశలు పెంచుకుంది. ఈ సినిమా హిట్ అయితే తెలుగు తమిళ ఇండస్ట్రీలో తనకు అవకాశాలు పెరుగుతాయని యామి ఆశ. ఈ సినిమాలో ఆమె సామాజిక బాధ్యత కలిగిన లాయర్‌గా కనిపించబోతుంది. ఈ పాత్ర యామికి మంచి పేరు తెస్తుందని అంటున్నారు.




## ప్రత్యేకపాత్రలో రెబల్



మరోసారి విలక్షణ నటుడు రెబల్ స్టార్ కృష్ణంరాజు తెలుగుతెరపై కనిపించబోతున్నాడు. 'చండి' సినిమాలో ఆయన ఫ్రీడమ్‌ఫైటర్‌గా, ఊరికి పెద్దగా, ప్రియమణికి తండ్రిగా నటిస్తున్నారు. డైరెక్టర్ సముద్ర కృష్ణంరాజు పాత్ర గురించి మాట్లాడుతూ ఆయన పాత్ర అందరికీ ముఖ్యంగా ఆయన అభిమానులకు ఎంతగానో నచ్చుతుందని చెప్తున్నారు.

## వయసులో వున్నాను కాబట్టే



'లీడర్' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ప్రియా ఆనంద్ తక్కువ కాలంలోనే మంచినటిగా గుర్తింపు తెచ్చుకుని హిందీ, తమిళ, తెలుగు సినిమాలలో అవకాశాలు తెచ్చుకుంది. వయసు ఉన్నప్పుడే హీరోయిన్‌గా చేయాలి కాబట్టి ఈమె సినిమాల్లో నటనకు మొగ్గుచూపింది. వయసు అయిపోయాక డైరెక్షన్ మీద దృష్టి పెడుతుందట.

## అవధులులేని ఆనందం



తాప్సీ బాలీవుడ్ నటించిన 'చష్మేబద్దూర్' విజయం సాధించడంతో ఆమె ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. ఈ సినిమాలో ఆమె నటనకు వచ్చిన ప్రశంసలతో ఉక్కిరిబిక్కిరి అవుతుంది. అయితే ఈ సినిమా హిట్ అయ్యిందని తనకు వచ్చిన ప్రతి అవకాశాన్ని ఒప్పుకోవడం లేదని, నా వద్దకు చాలా మంది డైరెక్టర్లు కాల్‌షీట్స్ కోసం వస్తున్నారంటుంది.

## తుఫాన్ కష్టాలు



రామ్‌చరణ్ నటిస్తున్న తొలి బాలీవుడ్ చిత్రం 'జంజీర్'కు కష్టాలు కంటిన్యూ అవుతున్నాయి. ఈ సినిమాను మాకు తెలియకుండా తెలుగు రీమేక్ చేసే హక్కు ఎవరికీ లేదంటూ జావేద్ అక్తర్ నిర్మాతకు అల్టిమేటం జారీ చేయడంతో ఈ సినిమా విడుదలకు మళ్ళీ బ్రేక్ పడింది. జావేద్‌కు నిర్మాత 3కోట్లు చెల్లిస్తే రామ్‌చరణ్ 'తుఫాన్' గట్టెక్కుతుంది.



## స్వీట్ భామలకు.. హాట్ వార్నింగ్

తమిళులపై శ్రీలంక సైన్యం చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా ఈ మధ్య తమిళనాడు ప్రభుత్వం, తమిళ సినీస్టార్లు ఒక్కరోజు నిరసనదీక్ష చేసారు. ఈ దీక్షకు సూపర్‌స్టార్ రజనీకాంత్‌ను మొదలుకొని వడివేల్ వరకు అందరూ హాజరయ్యారు. హీరోయిన్లలో త్రిష ముందువరుసలో వుండింది. అయితే తమిళసినిమాల్లో హవా చూపుతున్న హీరోయిన్లు నయనతార, కాజల్, తమన్న, సమంత వంటి తారామణులు హాజరు కాలేదు. దీంతో ఆగ్రహించిన నడిగర్ సంఘం ఇంకోసారి ఇలాంటి దీక్షలకు హాజరు కాకపోతే తమిళ ఇండస్ట్రీలో నటించకుండా నిషేధిస్తామని హెచ్చరించింది.

PDF Compressor Free Version



# నాటకాల ద్వారా ప్రజలను చైతన్యపరచాలి



వివిధ కళారూపాలను ప్రదర్శిస్తున్న కళాకారులు

కళాకారులు తమ నాటకాల ద్వారా ప్రజలను చైతన్య పరచాలని, సమాజాభివృద్ధికి వారు కూడా పాటుపడేలా వారి ఆలోచనల్లో మార్పు తీసుకురావాలని జిల్లా అదనపు జాయింట్ కలెక్టర్ సి. హెచ్. పెంచలరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరు టౌన్‌హాల్లో ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర టి.వి నాటకరంగ అభివృద్ధి సంస్థ, జిల్లా సాంస్కృతిక మండలి, జిల్లా పౌరసంబంధాలశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగునాటకరంగ దినోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలుగుభాషా వికాసానికి పాటుపడిన మహనీయుల్లో ఒకరైన కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని రాష్ట్రం తెలుగు నాటకరంగ దినోత్సవంగా జరుపుకుంటుందన్నారు. ఈ సందర్భంగా రంగస్థల కళాకారులు సరస్వతీలక్ష్మణన్, చిలుకోటి శ్రీనివాసరావు, కె. ఉదయభాస్కర్, ఎం.డి. ఖాజాబురాన్, ఎస్.పీరాన్‌లకు ఒక్కొక్కరికి 10వేలు నగదు పురస్కారాలు అంద జేసారు. ఈ కార్యక్రమంలో స్థానిక కళాకారులు మనుబోలు ప్రభాకరరావు, బాలాజీలు మిమిక్రీ, అల్లూరు సీతారామాజుగా కె.రామారావు, మాయల ఫకీర్‌గా జి.శ్రీనివాసులు, నటుడుగా దయాకర్‌రెడ్డి ఏకపాత్రాభినయాలు అందరిని ఆకట్టుకున్నాయి. తిరుపతి హరగోపాల్, ఉన్నం బసవయ్య, మునికుమార్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా సహస్ర సభాసింహం బి.వి.నరసింహం వ్యవహరించారు. కార్యక్రమ సరళిని డిపిఆర్‌ఓ కమలాకర్‌రెడ్డి, శింగంశెట్టి మురళీమోహన్‌రావులు నిర్వహించారు.

# డా॥ అంబేద్కర్‌కు కాంగ్రెస్ ఎస్సీసెల్ నివాళి



డా॥బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈనెల 14న నెల్లూరుజిల్లా కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్య క్షులు టి.బాలసుధాకర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు విఆర్‌సి కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినమ్రంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బాలసుధాకర్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా వెలిగిన మహానుభావుడు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌కు భారతదేశంలోని సంస్కరణ దృష్టి, బౌద్ధంలోని మానవత్వం నచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఏసునాయుడు, కన్వీనర్ తాటపర్తి మల్లిఖార్జున, కార్యదర్శి సువార్తమ్మ, ఆనంద్, బి.వెంకటేశ్వర్లు గౌడ్, టి.రూబిన్ తదితరులు పాల్గొన్నారు.

# మైపాడు-కోడూరు బీచ్‌లకు కొత్త కారిడార్



మైపాడు-కోడూరు బీచ్‌లను కలుపుతూ కొత్త కారిడార్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని గోల్డెన్ జూబ్లీ హాల్లో విలేకర్లతో మంత్రి మాట్లాడుతూ ఈ ప్రాంతాలను పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు ముందుగా కోడూరు బీచ్ నుంచి మైపాడు వరకు కొత్తగా రెండులైన్ల రోడ్డును వేయాల్సి ఉందన్నారు. మైపాడులో పర్యాటకంగా తీర్చిదిద్దడం జరిగిందని త్వరలో రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి వట్టి వసంతకుమార్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కేంద్రం నుంచి పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు 6.50కోట్లుకు ప్రతి పాదన పంపడం జరిగిందన్నారు. గతంలో 11.50 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. మెగా పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్రానికి ఒకటే వస్తుం దని, కేంద్ర పర్యాటకశాఖా మంత్రిగా ఉన్న చిరంజీవి విశాఖపట్నం, వరంగల్‌లో ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకుంటున్నందున జిల్లాకు వచ్చే అవకాశం లేదన్నారు.

# అలరించిన పాహిరామప్రభో కీర్తనలు



శ్రీరామనవమి పర్వదినం సంద ర్భంగా ప్రముఖ శాస్త్రీయ సంగీత విద్వాం సురాలు జె.బాలార్క శిష్యబృందం 13వ తేదీ సాయంత్రం నెల్లూరు టౌన్‌హాలులో నిర్వ హించిన 'పాహి రామప్రభో' కార్యక్ర మంలో వాగ్గేయకారుల కీర్తనలు భక్తిపార వశ్యంతో అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తొలుత జ్యోతి ప్రకాశనాన్ని రాళ్ళపల్లి సుబ్బలక్ష్మి, సురభి గాయత్రి, ఎ.లక్ష్మీప్రసన్న, కన్యాకుమారిలు గావిం చారు. అనంతరం గణేష్ ప్రార్థనతో కార్య క్రమం ప్రారంభమైంది. వియం జియర్, అన్నమాచార్య, రామదాసు, ముక్తిస్వామి దీక్షితార్, సబ్బవీస్‌లు రచించిన పలు కీర్తనలను అరుణ, హరిచందన, నిలయ, హేమంత సంధ్య, వాగ్దేవి, మానస, హైందవి, శ్రీదేవి, పద్మజ, ప్రీతి, బిందు, ఫణిశ్రీ, వైష్ణవి, యుక్తశ్రీ, సంహిత, సౌమ్య, లాస్య, మేఘన, స్నేహ, హరిజ, శిల్ప, అమృత, కామాక్షి, శ్రీహాస, ప్రతీక్, బుత్విక్, రిషిక, జస్వంత్, తేజేశ్, సంజన, అనీష్, శ్రీనిధి, భవిత, మోహిత, శ్రేయ, సుమంత్, రమ్య, లలితలు వీనులవిందుగా ఆలపించి అందరినీ ఆకట్టుకున్నారు. ప్రముఖ శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు జె.బాలార్క ఆల పించిన రామదాసు రచించిన రామభద్ర రారా కీర్తన అందరినీ మైమరపించింది. అనంతరం సీతారాముల కల్యాణం చూతమురారండి, రామచంద్రాయ జనక మంగళంతో ఈ కార్యక్రమం వైభవంగా ముగిసింది. కళాకారులకు వాయిద్య సహకా రాన్ని వయోలిన్ యం.లోకేష్, మృదంగం శాంతికళాధర్, వీణ మాలతి, రమ, ప్రీతి, కీబోర్డు జె.హరికార్తికేయులు అందించారు.

# శ్రీసిటీలో అనుకోని అతిథులు



చిత్తూరుజిల్లా కార్వేటి నగరం నుంచి నెల్లూరు జిల్లా సూళ్ళూరుపేటలో పర్యటనకు ఈనెల 14న వచ్చిన సంద ర్భంలో ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడు బొత్స సత్యనారాయణ, మంత్రి పితాని సత్యనారాయణలు మార్గ మధ్యంలో శ్రీసిటీలో విశ్రాంతి తీసుకు న్నారు. అనుకోని అతిథులుగా వారు శ్రీసిటీలో గడపటం పట్ల శ్రీసిటీ ఎండి రవిసన్నారెడ్డి మిక్కిలి ఆనందం వ్యక్తం చేసారు. ఈ సందర్భంలో ఎంఎల్‌సి వాకాటి నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు పరసారత్నం, సత్యవతి, నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు చెందిన పలువురు ప్రముఖులు ముఖ్యమంత్రిని కలిసారు. శ్రీసిటీలో శంకర నేత్రాలయం ప్రారంభిస్తున్న సమయంలోనే ముఖ్యమంత్రి రావడం యాదృచ్ఛికమే అయినా అది భగవత్ సంకల్పమనే భావిస్తున్నానని రవి సన్నారెడ్డి పేర్కొన్నారు.


## కృషితో నాస్తి దుర్భిక్షం



కేంద్రమంత్రి మనీష్ తివారీ చేతుల మీదుగా ఎన్‌టి అవార్డు

TV9 రిపోర్టర్‌గా పాత్రికేయ వృత్తిలో
ప్రయాణాన్ని మొదలుపెట్టి
అంచలంచెలుగా ఎదుగుతూ
ఎన్నో సంచలనాత్మక వార్తలతో
మరెన్నో పరిశోధనాత్మక కథనాలతో
ధైర్యసాహసాలతో ముందుకెళ్తూ
తన కృషికి గుర్తింపుగా మొన్న
'నేషనల్ టెలివిజన్ అవార్డును'
నిన్న ఢిల్లీ తెలుగు సాహిత్య అకాడమీ ద్వారా
'సమైఖ్యభారతి' గౌరవ సత్కార్ అవార్డును
అందుకున్న TV9 రాయలసీమజోన్
సీనియర్ ప్రిన్సిపల్ కరస్పాండెంట్

**నందిగం కృష్ణమోహన్‌కు**

మా హృదయపూర్వక అభినందనలు.



కేంద్రమంత్రి కపిల్‌సిబాల్ చేతులమీదుగా 'సమైఖ్యభారతి గౌరవ సత్కార్'

- స్నేహితులు

# సీల్డ్‌కవర్ సీయంకు సమస్యలు తెలుస్తాయా?



ప్రజాబ్యాలెట్ నిర్వహిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు బస్టాండులో ఈనెల 17న వైయస్సార్సీపీ జిల్లా కన్వీనర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ సర్‌ఛార్జీలను వ్యతిరేకిస్తూ ప్రజాబ్యాలెట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్టానం పంపిన సీల్డ్ కవర్ సీఎం అయిన కిరణ్‌కుమార్‌రెడ్డికి ప్రజల బాధలు తెలియవని పేర్కొన్నారు. అందుకే పన్నులు, విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెంచి ప్రజలను బాధలకు గురి చేస్తున్నారన్నారు. నాలుగు ప్రశ్నలతో ప్రజాబ్యాలెట్ నిర్వహిస్తున్నామని, మహిళల నుంచి దీనికి మంచి స్పందన వస్తుందని తెలిపారు. రాజన్నరాజ్యం రావాలంటే జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలన్నారు. పాదయాత్రలో షర్మిలకు వస్తున్న ప్రజాస్పందనను పరిశీలిస్తే జగన్‌పై ప్రజలకున్న నమ్మకం అర్థమవుతుందన్నారు. ప్రజలను హింసిస్తున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూకటివేళ్ళతో పెకలించాలన్నారు. కొందరు తమ పదవుల కోసం జగన్మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజలు గమనిస్తున్నారని, వాళ్ళే తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైయస్సార్సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు పేర్నేటి శ్యాం సుందర్‌రెడ్డి, కోసం బ్రహ్మయ్య, పార్టీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, నాయకులు వాకాటి శ్రీనివాసులురెడ్డి, మాలకొండారెడ్డి, మద్దిరెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భానుడి భగభగ... జనం విలవిల...

గత నెలరోజులుగా భానుడి భగభగలతో జనం విలవిలలాడుతున్నారు. ఎన్నడూ లేనివిధంగా భానుడు ఉగ్రరూపం దాల్చి సెగలు కక్కుతున్నాడు. వారంరోజులుగా రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రోహిణీకార్తెలో రోళ్ళు బద్ధలవుతాయనే సామెత నిజం చేస్తున్నాయి. గురువారం రికార్డుస్థాయిలో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఎండ తీవ్రతకు రోడ్లపై జన సంచారం కనుమరుగవుతోంది. రోడ్లపై నడవాలంటేనే జనం భయపడిపోతున్నారు. దీంతో అన్ని రోడ్లు, వీధులు, సందులు బోసిపోతున్నాయి. ముఖ్యంగా రోడ్డు ప్రక్కన అమ్ముకునే తోపుడుబండ్లు, రిక్షాపుల్లర్లు ఎండతీవ్రతను తప్పించుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. స్టోన్‌హౌస్‌పేట, నవాబుపేట, ట్రంకురోడ్డు, చిన్నబజారు, పెద్దబజారు తదితర ప్రాంతాలు వెలవెలపోతున్నాయి. మధ్యాహ్నం ఈ ఎండకు తోడు కరెంటుకోత కష్టాలతో ఉక్కపోతతో చిన్నపిల్లలు, పసిబిడ్డలు తట్టుకోలేక అల్లాడుతున్నారు.

ఈ వారంలో 15తేదీ 40డిగ్రీలు, 16వ తేదీ 41డిగ్రీలు, 17వ తేదీ 43.9డిగ్రీలు, 18వ తేదీ 44డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# 'ఇందిరమ్మ కలలు' నెరవేరుద్దాం



సిటీకాన్ఫరెన్స్‌లో పెంచలరెడ్డి

నెల్లూరుజిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 17న వివిధ శాఖల జిల్లా అధికారులతో ఇందిరమ్మకలలు పథకంపై సమీక్షా సమావేశం జరిగింది. సమావేశంలో అదనపు జె.సి. సిహెచ్ పెంచలరెడ్డి, జడ్పీ సిఇఓ వీరభద్రయ్య, మెప్మా పిడి కమలకుమారి, హౌసింగ్ కార్పొరేషన్ అధికారి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదనపు జెసి పెంచలరెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరమ్మకలలు పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ కాలనీలలోని సమస్యలను సంపూర్ణంగా పరిష్కరించే దిశలో కృషి చేయాలని అధికారులకు సూచించారు. మూడు మండలాలకు ఒక్కో అధికారి చొప్పున 15మందిని ప్రత్యేక అధి కారులుగా నియమించామని తెలిపారు. నెల్లూరు డివిజన్‌కు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సోమయ్య, కావలి డివిజన్‌కు సాంఘిక సంక్షేమ అధికారి విశ్వమోహన్‌రెడ్డి, గూడూరు డివిజన్‌కు ఐటిడిఏ పిఓ వెంకటేశ్వర్లును నియమించామని తెలిపారు.








శ్రీమతి కొండా శ్యామలమ్మ గారు

## ఉత్తరక్రియలు

మా ఇంటి దైవం, మా అభివృద్ధికి కారకులు

**శ్రీమతి కొండా శ్యామలమ్మ గారు**

తేది 10-04-2013 బుధవారం నాడు స్వర్గస్తులైనారు.

వారి పవిత్రాత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ...

శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

భర్త

**కొండా కోటారెడ్డి**

కుమారులు - కోడళ్లు

**కొండా చంద్రమోహన్‌రెడ్డి - స్వర్ణలత**

**కొండా రవీంద్రరెడ్డి - అరుణ**

మనుమలు, మనుమరాండ్రు, మునిమనుమలు, మునిమనుమరాలు

పెద్దకర్మ: తేది 24-04-2013 బుధవారం బుచ్చిరెడ్డిపాళెం మండలం, దామరమడుగు గ్రామములోని మా స్వగృహము నందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

Edited, Published, Printed & owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY.